
02

TGTEL/2026/A1889

# హైదరాబాద్ మిర్రర్

ప్రతి ఉదయం.. జన హృదయం

ఎడిటర్ & పబ్లిషర్ : మాకం గంగాధర్ సంపుటి : 01 సంచిక :84 బుధవారం 24 జూన్ 2026 వేల : 5/-

Circulation : Hyderabad, Rangareddy, Nalgonda, Yadadri Bhuvanagiri, Suryapet, Mahabubnagar, Khammam, Nizamabad, Sangareddy, Adilabad


02

## ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఇక్కడికి వచ్చా



చెన్నై,జూన్23(హైదరాబాద్ మిర్రర్):

తమిళనాడు విద్యార్థుల్లో నీట్ అసమానతల్ని సృష్టిస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అన్నారు. అసమానతలకు కారణమైన నీట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా హిందీ వివాదం, నీట్, కరూర్ తొక్కిసలాట ఘటన వంటి పలు అంశాలను ప్రస్తావించిన విజయ్ విమర్శకులకు గట్టిగా బదులిచ్చారు. ఈ మేరకు అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందీ భాషనూ వ్యతిరేకించారు. తమిళం, ఇంగ్లీష్‌లతో కూడిన ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉంటామన్నారు.

- నీట్‌తో విద్యార్థుల్లో గందరగోళం
- హిందీ మనకు అవసరం లేదు
- తమిళం, ఇంగ్లీష్ సరిపోతుంది
- కుటుంబ పార్టీలకు తాము వ్యతిరేకం

### ప్రజల సంపూర్ణ మద్దతుతో అధికారం చేపట్టాం

ప్రజలంతా తమ కుటుంబమనే భావనతో పాలన
కరూర్ తొక్కిసలాట ఘటన మరచిపోలేని విషాదం
అసెంబ్లీలో సీఎం విజయ్ కీలక ప్రసంగం

02



## హర్మూజ్‌ను తెరిచే ఉంచుతాం..

### అవసరమైతే నిర్బంధానికి సిద్ధమే..!

జూన్23(హైదరాబాద్ మిర్రర్)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హర్మూజ్ జలసంధి విషయంలో తన వైఖరిని స్పష్టం చేశారు. అంతర్జాతీయ జల రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని తెరిచే ఉంచుతామని పేర్కొన్న ట్రంప్.. అవసరమైతే తమ నౌకా దళాలను మోహరించి.. దిగ్బంధిస్తామని ఇరాన్‌ను హెచ్చరించారు. ప్రస్తుతానికి హర్మూజ్ బ్లాకేడ్‌పై తొందరపడడం లేదని, ఇరాన్ దారికి రాకుంటే నిర్బంధం తప్పదని ట్రంప్ తేల్చి చెప్పారు.హర్మూజ్ జలసంధి మూసివేతపై సోషల్ మీడియా ట్రుత్ వేదికగా డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాన్‌తో చర్చలు ఫలవంతమయ్యేలా కనిపిస్తున్నందున తాను హర్మూజ్‌ను తెరిచి ఉంచేందుకు అంగీకరించానని అమెరికా అధ్యక్షుడు తెలిపారు.'హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచేందుకు నేను అంగీకరించాను. ఇకపై నౌకలతో హర్మూజ్‌ను దిగ్బందించం. అదే సమయంలో మా నౌకలన్నీ బ్లాకేడ్‌కు సిద్ధంగా ఉన్నాయి. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో దిగ్బంధనం వద్దనిపిస్తోంది అని ట్రుత్ పోస్ట్‌లో పేర్కొన్న ట్రంప్.. అణ్వాయుధాల పరిశీలనకు ఇరాన్ పూర్తిగా అంగీకరించిందని వెల్లడించారు. ఒకవేళ టెహ్రాన్ తమ అణ్వాయుధాల పరిశీలనకు అనుమతించకుంటే చర్చలను నిలిపివేస్తామ'ని ట్రంప్ హెచ్చరించారు. ఓవైపు శాంతి చర్చలు జరుగుతుండగానే.. లెబనాన్‌పై ఇజ్రాయేల్ దాడులకు ప్రతిచర్యగా హర్మూజ్‌ను ఇరాన్ మూసివేసిన విషయం తెలిసిందే.

## చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం వెతుకుతున్న భార్య కథ

### సిఎం విజయ్‌ను ఉద్దేశిస్తూ.. ఉదయనిధి కౌంటర్

చెన్నై,జూన్23(హైదరాబాద్ మిర్రర్):



తమిళనాడు అసెంబ్లీ సమావేశాలు వాడీవేడీగా జరిగాయి. హిందీ వివాదం, నీట్, కరూర్ తొక్కిసలాట ఘటన, రైతుల నిరసన అంశాలను మంగళవారం సీఎం విజయ్ ప్రస్తావించారు. ప్రతిపక్ష పార్టీలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, వారి ఉచ్చులో రైతులు పడదని తెలిపాడు. అలానే కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను అర్థం చేసుకొని, మద్దతు ఇవ్వాలని రైతులను సీఎం కోరారు. విజయం చేసిన ఈ వ్యాఖ్యలపై ప్రతిపక్ష నేతగా ఉదయనిధి స్టాలిన్ స్పందించాడు. తమిళనాడులో టీవీకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయాలు కొత్త మలుపు తీసుకున్నాయి. మంగళ వారం అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి విజయ్ చేసిన ప్రసంగానికి ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ కౌంటర్ ఇస్తూ వ్యక్తిగత విమర్శలకు దిగారు.

02



## కేసీఆర్ పాలనను గుర్తుచేసిన హరీష్

- కాంగ్రెస్ హామీలపై హరీష్ రావు ఫైర్
- రైతుబంధు, రుణమాఫీపై విమర్శలు
- 'రైతు క్షమాపణ సభ'గా మార్చాలంటూ ఎద్దేవా
- 'రైతు ఆశీర్వాద సభ' కాదు.. 'రైతు క్షమాపణ సభ' పెట్టుకోండి.!

భద్రాద్రి కొత్తగూడెం,జూన్23(హైదరాబాద్ మిర్రర్):

- మిగతా 2లో...

## భారతదేశ అసలు సిసలైన హీరో శ్యామాప్రసాద్ ముఖర్జీ

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్



కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ దేశం కోసం యుద్ధం చేయడానికి జన సంఘ్ కార్యకర్తలకు తుపాకీలిచ్చి పాకిస్తాన్ పై యుద్ధం చేయడానికి పంపిన వీరుడు పార్టీ, రాజకీయాల కంటే దేశమే ఫస్ట్ అని చాటి చెప్పిన గొప్ప నేత.

దేశం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ అధ్యక్షుడు

శ్యామాప్రసాద్ ఆశయాలను అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వం.

370 ఆర్టికల్ రద్దు,మేక్ ఇన్ ఇండియా,స్టార్టప్ ఇండియా ముఖర్జీ ఆకాంక్షలే

దళారీ వ్యవస్థ లేకుండా లబ్దిదారులకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం

- మిగతా 2లో...

## స్కీం వెనుక స్కాం

### - కేటీఆర్



హైదరాబాద్ జూన్ 23, (హైదరాబాద్ మిర్రర్)

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డికి ఒక్కటే ఎజెండా ఉందని, అది మెట్రో భూముల స్కామ్ అని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, "రేవంత్ రెడ్డి కన్నంతా మెట్రో భూముల మీదే పడింది. ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కామ్ పక్కా ఉంటుంది" అని ఆరోపించారు.మెట్రో సమీపంలో 280 ఎకరాల విలువైన భూములు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.30 వేల కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఈ భూములను తన అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుళ్లకు కట్టబెట్టడానికే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. దీని కోసం ప్రజలపై రూ.14 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు."కేసీఆర్ ప్రభుత్వం 72 కిలోమీటర్ల మెట్రోను బ్రహ్మాండంగా నిర్మించింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో టెండర్లు కూడా పూర్తి చేసి, 2023 జూన్-జులైలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి వచ్చి ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేశారు.

### పాఠశాలలు, అంగన్‌వాడీలకు

## నిరంతర నీటి సరఫరా

స్వచ్ఛ భారత్ మిషలన్ లక్ష్యాలపై కీలక సూచనలు

అధికారలుతో అభివృద్ధి, సంక్షేమాలపై మంత్రి సీతక్క సమీక్ష

హైదరాబాద్,జూన్23(హైదరాబాద్ మిర్రర్):



పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నిరంతర నీటి సరఫరా ఉండాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధనపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులకు సూచనలు చేశారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలపై మంత్రి సీతక్క రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలతో మంత్రి సమావేశమయ్యారు



## ఘనంగా పద్మపురస్కారాల ప్రదానం

- పద్మభూషణ్ అందుకున్న నటుడు మమ్ముట్టి
- పద్మశ్రీలు అందుకున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్
- కార్యక్రమంలో ప్రధాని మోడీ తదితరుల హాజరు

న్యూఢిల్లీ,జూన్23(హైదరాబాద్ మిర్రర్):

రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు అందజేశారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. సినీ, సాహిత్య, వైద్య, క్రీడా తదితర రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులు ఈ గౌరవాలను అందుకున్నారు.

02

## కేంద్రమంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

### గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై తుమ్మల విజ్ఞప్తి



న్యూఢిల్లీ,జూన్23(హైదరాబాద్ మిర్రర్):

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరఫున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు.

# కేసీఆర్ పాలనను గుర్తుచేసిన హరీష్

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలకు, రైతులకు నమ్మకద్రోహం చేశారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. హామీలు 100 రోజుల్లో నెరవేర్చకపోతే నిలదీయమన్న భట్టి విక్రమార్క మాటలను గుర్తు చేస్తూ.. మరి ఇప్పుడు రండి, మిమ్మల్ని నిలదీస్తాం అని హరీష్ రావు సవాల్ విసిరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలపై హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మేమిచ్చిన పంటల బోనస్ 3 సార్ల రైతు బంధు కంటే ఎక్కువ అని మంత్రి జూపల్లి కృష్ణారావు అంటుండు. అసలు జూపల్లికి తెలివి ఉందా..? అని మాజీ మంత్రి మండిపడ్డారు. అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. రెండు బోనస్‌లు అయితే ఎగ్గొట్టినవ్.. పోయిన యాసంగి బోనస్ రూ.1200 కోట్లు, ఈ యాసంగి బోనస్ రూ. 1000 కోట్లు ఎగ్గొట్టినవ్ అని సీఎం రేవంత్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. అంతగొడితే నువ్వు బోనస్ ఇచ్చింది రూ.2500 కోట్లు.. కానీ మీరు ఎగగొట్టిన రైతు బంధు విలువ రూ.29,350 కోట్లు అని ధ్వజమెత్తారు. జూపల్లి తెలుసుకో లెక్క. చర్చ పెడదామా.. అసెంబ్లీకి వచ్చి మాట్లాడదాం. నువ్వు ఇచ్చిన బోనస కేవలం 3వేల కోట్లు కూడా దాటదు. నువ్వేమైనా తెలిసి మాట్లాడుతున్నవా.. తెలియక మాట్లాడు తున్నవా..? చిన్న మెదడు ఏమైనా చితికిపోయిందా..? నాకైతే అర్థమైతలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలకు ఎక్కువ.. చేతలకు తక్కువ. ఆయన దగ్గర మూడు శాఖలున్నాయి. విద్యాశాఖ, హోంశాఖ, మున్సిపల్ శాఖ.. ఈ మూడింటిలో కూడా అట్టర్‌ప్లాప్ అయిండని హరీశ్ రావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులుండి చేసింది గుండుసున్నా. రేవంత్ రెడ్డి మూడు శాఖలు పెట్టుకుని చేసింది కూడా గుండు సున్నా. విద్యాశాఖ మంత్రిగా ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణలో రేవంత్ రెడ్డి ఫెయిల్ అయిపోయిండు.. మున్సిపల్ శాఖ, హోంమంత్రిగా ఫెయిల్ అయిండు. కానీ ఒక్క దాంట్లో మాత్రం పాసయ్యిండు. ఢిల్లీకి సంచులు మోసే శాఖలో మాత్రం పాసయ్యిండంటూ ఎద్దేవా చేశారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన హామీలు , వాటిపై ఆయన ఎన్నిసార్లు మాట తప్పారో చూపే ప్రత్యేక వీడియోలను స్క్రీన్‌పై ప్లే చేస్తూ హరీష్ రావు కాంగ్రెస్ తీరును ఎండగట్టారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రెండు పంటలకు రూ. 10 వేలు చొప్పున రైతుబంధు ఇస్తుంటే, తాము అధికారంలోకి వస్తే మూడు పంటలకు రూ. 15 వేలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు నమ్మబలికారని హరీష్ రావు విమర్శించారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని ఎందుకు అమలు చేయలేదని ఆయన నిలదీశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. కరోనా మహమ్మారి వంటి అత్యంత కఠినమైన ఆర్థిక పరిస్థితుల్లో కూడా ఎక్కడా ఆగకుండా 13 లక్షల రైతు కుటుంబాలకు రూ. 73 వేల కోట్ల రైతుబంధు నిధులను సకాలంలో అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని గుర్తు చేశారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా ప్రజలకు ఏం కావాలో ముందే గుర్తించి చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఇప్పుడు అచ్చంపేట చూసినా, అశ్వారావుపేట చూసినా ప్రజలందరి నోటా 'మళ్లీ కేసీఆర్ రావాలి' అనే మాట ఒక్కటే వినిపిస్తోందని అన్నారు. రెండు లక్షల రైతు రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఎగ్గొట్టిందని హరీష్ రావు ధ్వజమెత్తారు. భద్రాద్రి రాముడిని సాక్షిగా పెట్టి రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి, చివరకు ఆ దేవుడినే మోసం చేశారని, ఇక ప్రజలను మోసం చేయకుండా ఉంటారా అని ప్రశ్నించారు. త్వరలోనే మధిరలో భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు 'రైతు ఆశీర్వాద సభ' అని పేరు పెట్టడం రైతాంగాన్ని అవమానించడమేనన్నారు. రైతులను మోసం చేసినందుకు గానూ ఆ సభకు 'రైతు క్షమాపణ సభ'గా నామకరణం చేసుకోవాలని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, మార్కెట్‌లో యూరియా దొరకడం లేదని, యాసంగి బోనస్ రెండు సార్లు ఇవ్వాల్సి ఉన్నా అడ్రస్ లేదని హరీష్ రావు విమర్శించారు. వడ్ల కొనుగోళ్లలో క్వింటాకు 5 కేజీల చొప్పున తరుగు తీస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారని మండిపడ్డారు. 'అసెంబ్లీలో వడ్లకు తరుగు తీస్తే తోలు తీస్తా అన్న రేవంత్ రెడ్డి.. ఇప్పుడు తరుగు తీస్తున్నా పట్టించుకోకుండా రైస్ మిల్లర్లు, దళారుల చేతుల్లో తోలుబొమ్మగా మారారు' అని ఘాటుగా విమర్శించారు. పెద్దవాగు ప్రాజెక్ట్ కొట్టుకు పోవడానికి పూర్తిగా ఈ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీష్ రావు ఆరోపించారు. ప్రమాద సమయంలో గేట్లు ఎత్తే నాథుడే లేకపోవడం వల్లే ఆ ప్రాజెక్ట్ కొట్టుకుపోయిందన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్తగా ఒక్క ప్రాజెక్ట్ కూడా కట్టలేదు సరే కదా, ఉన్న ప్రాజెక్టులను కూడా కాపాడుకోలేక కొట్టుకుపోయేలా చేస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయ బావులకు, బోరుబావులకు రైతుల వద్ద 'డిస్కమ్' మీటర్లు పెట్టాలని చూస్తున్నారని, అదే గనుక జరిగితే రైతులకు రోజుకు కేవలం 6 గంటల కరెంట్ మాత్రమే వస్తుందని హెచ్చరించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో 24 గంటల కరెంట్ ఎలా ఉంటుందో, అశ్వారావుపేట గ్రామీణ ప్రాంతాల్లో కూడా అలానే ఉండాలని ఆశించి ఉచిత విద్యుత్ ఇచ్చారని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఎస్సీ, ఎస్టీలకు ఒక్క కార్పొరేషన్ లోన్ కూడా ఇప్పించలేకపోయారని హరీష్ రావు విమర్శించారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ఎంతమంది గిరిజన పిల్లలకు సహాయం అందించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ప్రశ్నిస్తే.. రూ. 2,750 కోట్లు కేటాయించామని చెప్తున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ముమ్మాటికీ గిరిజన వ్యతిరేక ప్రభుత్వమని హరీష్ రావు దుయ్యబట్టారు.

### పాఠశాలలు, అంగన్‌వాడీలకు

# నిరంతర నీటి సరఫరా

మొదటిపేజీ తరువాయి

. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్ష చేశారు. ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించారు. అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, జీపీ కార్యాలయాల నిర్మాణాలపై సమీక్షించారు. జల సంరక్షణ పనులు, చెక్‌డ్యాంల నిర్మాణాలపై అధికారులతో మంత్రి చర్చలు జరిపారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన(పీఎమ్‌కేఎస్‌వై) పనుల అమలుపై మంత్రి సమీక్ష జరిపారు. గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరుపై సీతక్క ఆరా తీశారు. పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల పురోగతిపై చర్చించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులపైనా సమీక్ష చేశారు. గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులపై పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు. మహిళా సంఘాల బలోపేతం, బ్యాంక్ లింకేజీల పెంపుపై సెర్ప్‌తో చర్చించారు. మహిళల జీవనోపాధి అవకాశాల విస్తరణకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రతి పథకం అమలు కావాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అలాగే, గ్రామ స్థాయిలో భూగర్భ జలాలు పెంచే విధంగా 'జలసిరి' పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.

# బోయినపల్లి మండల అభివృద్ధిపై కలెక్టర్ తో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భేటీ

(హైదరాబాద్ మిర్రర్) న్యూస్ ముస్తాబాద్ సిరిసిల్ల

చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని బోయినపల్లి మండల అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భేటీ అయ్యారు. జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ తో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మండలంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, రోడ్లు ఇతర నిర్మాణ పనులపై చర్చించారు. అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులు పరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. మద్య మానేరు ముంపు గ్రామాల వాసుల సమస్యలపై చర్చించి త్వరితగతిన వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యూరియా యాప్, సన్న వడ్ల సాగు, ఆయిల్ ఫామ్ సాగు పంటల మార్పిడి తదితర అంశాలపై చర్చించారు.

మొదటిపేజీ తరువాయి

# భారతదేశ అసలు సిసలైన హీరో శ్యామాప్రసాద్ ముఖర్జీ

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్(హైదరాబాద్ మిర్రర్)



కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ దేశం కోసం యుద్ధం చేయడానికి జన సంఘ్ కార్యకర్తలకు తుపాకీలిచ్చి పాకిస్తాన్ పై యుద్ధం చేయడానికి పంపిన వీరుడు

పార్టీ, రాజకీయాల కంటే దేశమే ఫస్ట్ అని చాటి చెప్పిన గొప్ప నేత.

దేశం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ అధ్యక్షుడు

శ్యామాప్రసాద్ ఆశయాలను అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వం.

370 ఆర్టికల్ రద్దు,మేక్ ఇన్ ఇండియా,స్టార్టప్ ఇండియా ముఖర్జీ ఆకాంక్షలే

దళారీ వ్యవస్థ లేకుండా లబ్దిదారులకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్.

శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన కేంద్ర మంత్రి..భారతదేశ అసలు సిసలైన హీరో శ్యామాప్రసాద్ ముఖర్జీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభివర్ణించారు.దేశం కోసం యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలని జన సంఘ్ కార్యకర్తలను పిలుపునివ్వడమే కాకుండా కార్యకర్తలకు తుపాకీలిచ్చి పాకిస్తాన్ పై యుద్ధం చేయడానికి పంపిన వీరుడని కొనియాడారు. పార్టీ, వ్యక్తులు, రాజకీయాల కంటే దేశమే ఫస్ట్ అని చాటి చెప్పిన గొప్ప నేత శ్యామాప్రసాద్ ముఖర్జీ అని, దేశం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ అధ్యక్షులు,పార్లమెంట్ లో ఏకైక ప్రతిపక్ష నేత కూడా ఆయనేనని తెలిపారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆలోచనలను,ఆశయాలను, ఆకాంక్షలను బీజేపీ తూ.చ తప్పకుండా అమలు చేస్తోందని తెలిపారు.ముఖర్జీ ఆకాంక్షలకు అనుగుణంగా వాజ్ పేయి ప్రభుత్వం అణ్వాయుధాలను సమకూరిస్తే..370 ఆర్టికల్ ను రద్దు చేసి శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలను నరేంద్రమోదీ నెరవేర్చారని మహనీయుడి ఆశయాలు, ఆకాంక్షలను అమలు చేయడమే ఆయనకు అందిస్తున్న ఘనమైన నివాళి

మొదటిపేజీ తరువాయి

# ఘనంగా పద్మపురస్కారాల ప్రదానం

మలయాళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం లభించింది. అలాగే ప్రముఖ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కూడా పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేశారు. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌తో పాటు నటుడు ఆర్. మాధవన్‌కు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. క్రికెటర్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి అందజేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా.. సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి మంగళవారం ప్రదానం చేశారు. దేశ అభివృద్ధికి, తమ తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం వెతుకుతున్న భార్య కథ

### సిఎం విజయ్‌ను ఉద్దేశిస్తూ.. ఉదయనిధి కౌంటర్

చెన్నై,జూన్23(హైదరాబాద్ మిర్రర్):

తమిళనాడు అసెంబ్లీ సమావేశాలు వాడీవేడీగా జరిగాయి. హిందీ వివాదం, నీట్, కరూర్ తొక్కిసలాట ఘటన, రైతుల నిరసన అంశాలను మంగళవారం సీఎం విజయ్ ప్రస్తావించారు. ప్రతిపక్ష పార్టీలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, వారి ఉచ్చులో రైతులు పడదని తెలిపాడు. అలానే కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను అర్థం చేసుకొని, మద్దతు ఇవ్వాలని రైతులను సీఎం కోరారు. విజయం చేసిన ఈ వ్యాఖ్యలపై ప్రతిపక్ష నేతగా ఉదయనిధి స్టాలిన్ స్పందించాడు.తమిళనాడులో టీవీకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయాలు కొత్త మలుపు తీసుకున్నాయి. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి విజయ్ చేసిన ప్రసంగానికి ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ కౌంటర్ ఇస్తూ వ్యక్తిగత విమర్శలకు దిగారు. సీఎం విజయ్-సంగీత విడాకుల అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించారు. చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం భార్య వెతుకుతున్న కథ రాష్ట్రానికి తెలుసని ఉదయనిధి స్థాలిన్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలు రెచ్చగొట్టడం వల్లే రైతులు నిరసన తెలుపుతున్నారని విజయ్ పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపాడు. చిన్న స్టోరీ చెప్తానంటూ విజయ్ చేసిన వ్యాఖ్యలు రైతుల గౌరవానికి భంగం కలిగించేవిగా ఉన్నాయని ఉదయ్ నిధి స్టాలిన్ పేర్కొన్నాడు. చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం భార్య వెతికే కథ మాత్రమే తమిళనాడు ప్రజలకు తెలుసంటూ సీఎం విజయ్ పై ఉదయనిధి వ్యక్తిగత విమర్శలు చేశారు. విజయ్ నుంచి విడాకులు కావాలని ఆయన భార్య సంగీత ఫిబ్రవరి 24న చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ఆగస్టు 7న తదుపరి విచారణ జరగనుంది.

మొదటిపేజీ తరువాయి

# ప్రజల సంపూర్ణ మద్దతుతో అధికారం చేపట్టాం

నీట్ వల్ల సామాజిక అసమానతలు పెరుగు తున్నాయని సీఎం విజయ్ చెప్పుకొచ్చారు. విద్యార్థులపై తీవ్ర మానసిక ఒత్తిడి తెస్తున్న ఈ పరీక్షను రద్దుచేసి, ఇంటర్ మార్కుల ఆధారంగా వైద్య సీట్లను కేటాయించాలని తమిళనాడు చాలా కాలంగా కోరుతోందని ఆయన గుర్తుచేశారు. హిందీ భాషపైనా స్పందిస్తూ.. తమిళం రాష్ట్ర భాషగా, ఇంగ్లీష్ అంతర్జాతీయ భాషగా సరిపోతాయని తన వైఖరిని స్పష్టం చేశారు. మూడో భాషను బలవంతంగా రుద్దాల్సిన అవసరంలేదని, రెండు భాషల విధానమే కొనసాగుతుందని తేల్చి చెప్పారు. తమ పార్టీని విమర్శించే వారికి ఈ సందర్భంగా గట్టిగా సమాధాన మిచ్చారు సీఎం విజయ్. ప్రజల మద్దతుతోనే తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధికారంలోకి వచ్చిందన్న ఆయన.. దీని వెనుక ఎన్నో కుట్రలు, సవాళ్లను ఎదుర్కొ న్నామన్నారు. 'జనం గుండెల్లో స్థానం సంపాదించడం అంత సులువు కాదు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే ఇక్కడకు వచ్చాం. అయినప్పటికీ కొందరు 'నటుడి పార్టీ' అనే విమర్శలు గుప్పిస్తున్నారు. వాటన్నింటినీ మేం పట్టించుకోం. మా రాజకీయాలు పారదర్శకంగా ఉంటాయని విజయ్ చెప్పుకొచ్చారు. అలాగే కుటుంబ రాజకీయాలపై ఆయన మాట్లాడుతూ.. 'మా రాజకీయాలు ఒక్క కుటుంబం కోసమే కాదు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం మాదే. అదే మా పాలన.. అదే మా లక్ష్యం' అని స్పష్టం చేశారు. ఎన్నో సవాళ్లను దాటి తాము అధికారంలోకి వచ్చామని, నటుడి పార్టీ అని తమను ఎంతోమంది ఎగతాళి చేశారని గుర్తుచేసుకున్నారు. మాకు ఈ అధికారం అంత సులువుగా వచ్చింది కాదు. తమిళనాడు ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు నేను, నా పార్టీ ఎన్నో కుట్రలు, సవాళ్లను అధిగమించాల్సి వచ్చింది. మాది యాక్టర్ పార్టీ అని, నేను సినిమా షూటింగ్ నుంచి నేరుగా సీఎం కుర్చీలో కూర్చున్నానని చాలా మంది గేలి చేశారు. అలాంటి విమర్శలు నేను పట్టించుకోను. సాధారణంగా చాలా మంది రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్లోకి వెళ్తారు. కానీ, నేను ప్రజల్లోకి వెళ్లిన తర్వాత పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేశా. నాపై నమ్మకం ఉంచి ప్రజలు గెలిపించారని విజయ్ అన్నారు. తమిళనాడులో ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉన్నట్లు సీఎం పునరుద్ఘాటించారు. హిందీ భాషను రుద్దేందుకు కేంద్రం చేస్తోన్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రసంగంలో భాగంగా ఎన్నికల ప్రచార సమయంలో చోటుచేసుకున్న కరూర్ తొక్కిసలాట ఘటనను విజయ్ ప్రస్తావించారు. 41 మంది ప్రాణాలు కోల్పోయిన ఆ విషాద ఘటన నన్ను ఎంత వేదనకు గురిచేసిందో మాటల్లో చెప్పలేను. ఆ బాధ నన్ను ఎన్నటికీ వదలదు. ఆ ఘటన విషయంలోనూ మాపైనే నిందలేశారు. ఇది అత్యంత దారుణం. రాజకీయాలు ఇంత క్రూరంగా ఉంటాయా అని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారసత్వ రాజకీయాల గురించి స్పందిస్తూ డీఎంకేపై విజయ్ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. డీఎంకేను ఉద్దేశిస్తూ కేవలం ఒక కుటుంబానికే ప్రాధాన్యమివ్వడం మా రాజకీయ విధానం కాదు.

మొదటిపేజీ తరువాయి

# సెల్ఫ్ గోల్ చేసుకుంటున్న కవిత

హైదరాబాద్, జూన్ 23 (హైదరాబాద్ మిర్రర్)



నీ బలం , సామర్థ్యం ఎంతో తెలియాలంటే నీ ప్రత్యర్థిని బట్టే తెలుస్తుంది. అంటే నీవు ఎంచుకునే ప్రత్యర్థిని బట్టే నీ స్థాయి ఖరారవుతుంది. రాజకీయాల్లో ఇది వంద శాతం నిజం. తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయం చేస్తున్న కల్వకుంట్ల కవిత ఉద్యమకారిణి తరహా రాజకీయ నేత అయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఇక్కడే బెడిసికొట్టాయి. తెలంగాణలో కనీస ఉనికి లేని జనసేన పార్టీని ఆమె ప్రత్యర్థిగా ఎంచుకున్నారు. రోజూ పవన్ పై విమర్శలు చేస్తూ.. అదే రాజకీయంగా గడిపే స్తున్నారు.రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా మేథోమథనం జరిపి.. తన సరికొత్త పార్టీ స్ట్రాటజీని, భవిష్యత్తు యాక్షన్ ప్లాన్‌ను, ప్రజల్లోకి వెళ్లే వినూత్న లైన్‌ను ఆమె సిద్ధం చేసుకున్నట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ప్రచారమే జరిగింది.

మొదటిపేజీ తరువాయి

# రేవంత్ కోరారు.. కేంద్రమంత్రులను కలిసాం

### ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ,జూన్23(హైదరాబాద్ మిర్రర్):



ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, మంగళశారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో రేవంత్ సమావేశమయ్యారు. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 విస్తరణపైనే చర్చ జరిగింది. రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలవడంపై కిషన్ రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు.'కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండుసార్లు నాకు లేఖ రాశారు. 22వ తేదీన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, 23వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించాను. మెట్రో రైల్ విస్తరణపై సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న నేను రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా పనిచేస్తా' అని ఎక్స్‌లో కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## బీఎస్పీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా

# అయితరాజు అబ్బేందర్ నియామకం



**సంస్థాన్ నారాయణపురం, జూన్ 23(హైదరాబాద్ మిర్రర్):**

బహుజన్ సమాజ్ పార్టీ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ ఆదేశాల మేరకు ఉమ్మడి నల్గొండ జిల్లా పర్యవేక్షకులు ఈశ్వర్, రవీంద్ర నాయక్ ల సూచనలతో మునుగోడు నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జిగా అయితరాజు అబ్బేందర్ ని నియమిస్తున్నట్లు నల్గొండ జిల్లా అధ్యక్షులు రావులపాటి రవిశంకర్ ప్రకటించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, బహుజనుల హక్కుల సాధన కోసం పోరాడడంలో, సామాజిక న్యాయం స్థాపనలో అబ్బేందర్ చురుకైన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ఈ బాధ్యతను అప్పగించినట్లు తెలిపారు.మునుగోడు నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు గ్రామ స్థాయి నుంచి పార్టీ విస్తరణకు కృషి చేస్తానని అయితరాజు అబ్బేందర్ తెలిపారు. బహుజన సమాజ అభ్యున్నతి, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక సమానత్వం కోసం పార్టీ కార్యకర్తలందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు.ఈ నియామకాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు.

# మున్సిపల్ కార్మికులందరికీ బీమా కల్పించాలి

## క్యాతనపల్లి కమిషనర్‌కు సీఐటీయూ వినతిపత్రం

**క్యాతనపల్లి,జూన్ 23 హైదరాబాద్ మిర్రర్**

తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్‌కు పలు సమస్యల పరిష్కారాన్ని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న కార్మికులపై అధికారులు అదనపు పని భారం మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.మున్సిపల్ కార్మికులందరికీ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని,విధి నిర్వహణలో అవసరమైన సబ్బులు,నూనె, చెప్పులు,బెల్లం వంటి సంక్షేమ వస్తువులను అందించాలని కోరారు.అలాగే కార్మికులపై పని ఒత్తిడిని తగ్గించి,వారి సంక్షేమానికి తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సాంబారి వెంకటస్వామి, మున్సిపల్ యూనియన్ నాయకులు మహేందర్, దేవవరం,రాజయ్య,తిరుపతి, రమేష్,సుధాకర్,కుమార్, పోశం,మల్లేష్,శ్రీను, రామస్వామి,వి.కుమార్,రవి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీవర్ధంతి

**హైదరాబాద్ మిర్రర్ బాలాపూర్ ప్రతినిధి:**

జూన్23 :- ప్రశాంతి హిల్స్ 58 డివిజన్ లో బీజేపీ పార్టీ అధ్యక్షులు పాసనూరి బిక్షపతి చారి ఆధ్వర్యంలో జన్ సంఘ్ వ్యవస్థాపకులు దేశీయ రాష్ట్రీయ భావజాలానికి బలమైన పునాదులు వేసిన మహానీయుడు అఖండ భారత వాని కోసం ప్రాణాలర్పించిన భరతమాత ముద్దుబిడ్డ డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివాస్ వారి వర్ధంతి సందర్భంగా వారికి ఘన నివాళులర్పించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో బీజేపీ జనరల్ సెక్రెటరీ ఇంద్రావత్ రవి నాయక్ రాష్ట్ర నాయకులు చేవ్వా శ్రావణ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి రాజు సీనియర్ నాయకులు గాజుల మధు, విక్కీ సాగర్ రాఘవేందర్ గౌడ్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు



# గూడెం గుట్ట అభినవ శబరిమలైలో 34వ వార్షికోత్సవ మహోత్సవాలు వైభవంగా అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన దేవస్థానం

## - వేలాది మంది భక్తుల పాల్గొనిక

**హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి, మంచిర్యాల,జూన్ 23:**



మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గూడెం గుట్టపై వెలసిన అభినవ శబరిమలైగా ప్రసిద్ధి చెందిన శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో 34వ వార్షికోత్సవ మహోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించబడ్డాయి.స్వామి వారి అనుగ్రహం కోసం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు వేడుకల్లో పాల్గొని ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు.వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి పూజ,స్వస్తి పుణ్యాహవాచనం,అయ్యప్ప స్వామి ప్రత్యేక అభిషేకాలు, అష్టోత్తర శతకలశ మహా స్నపనం,హోమాలు,భజనలు, హారతులు తదితర కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా సాగాయి. అయ్యప్ప నామస్మరణలు, శరణుఘోషలతో ఆలయ ప్రాంగణం మార్మోగిపోయింది.ఈ మహోత్సవ కార్యక్రమాలను శ్రీ శ్రీ మాన్ చక్రవర్తుల పురుషోత్తమాచార్యులు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా, అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా తోట ప్రవీణ్ గురుస్వామి,శ్రీకాంత్ గురుస్వామి,కిషన్ గురుస్వామి,సత్యనారాయణ గురుస్వామి,శ్రీనివాస్ గురుస్వామి పలువురు గురుస్వాములు,అయ్యప్ప సేవా బృందాల సభ్యులు,భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ,గూడెం గుట్ట అభినవ శబరిమలై క్షేత్రం ఉత్తర తెలంగాణలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ప్రతి ఏడాది నిర్వహించే వార్షికోత్సవాలకు భక్తుల ఆదరణ పెరుగుతుండడం ఆనందదాయకమని పేర్కొన్నారు.అయ్యప్ప స్వామి ఆశీస్సులతో భక్తులందరికీ ఆయురారోగ్యాలు,ఐశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు.భక్తి,శ్రద్ధ,ఆధ్యాత్మికత కలగలిసిన ఈ 34వ వార్షికోత్సవ వేడుకలు భక్తులకు మరపురాని అనుభూతిని మిగిల్చాయి. అయ్యప్ప స్వామి శరణుఘోషల మధ్య జరిగిన ఈ మహోత్సవం గూడెం గుట్ట క్షేత్ర వైభవాన్ని మరోసారి చాటిచెప్పింది.



# హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఫిర్యాదు

## - ప్రజావాణిలో ప్రగతినగర్ నివాసితుల వినతి

**నిజాంపేట్, జూన్ 23 (హైదరాబాద్ మిర్రర్):**

మియాపూర్ – గండిమైసమ్మను కలుపుతూ నిర్మిస్తున్న 6 లైన్ల రహదారి ప్రధాన వరద కాలువలను ప్రగతినగర్ కమాన్ వద్ద చిన్న పైపులకు అనుసంధానం చేయడంపై స్థానిక నివాసితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'హైడ్రా' కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు తుమ్మేటి శరత్ రెడ్డి, వడ్లకొండ సందీప్ తదితరులు హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌ను స్వయంగా కలిసి ఈ విషయమై ఒక వినతిపత్రం సమర్పించారు.?రహదారికి ఇరువైపులా నిర్మిస్తున్న 1200 ఎంఎం చొప్పున మొత్తం 2400 ఎంఎం సామర్థ్యం గల భారీ వరద కాలువలను, ప్రగతినగర్‌లోని కేవలం 200 ఎంఎం చిన్న పైపులకు అనుసంధానం చేయడం వల్ల భవిష్యత్తులో కాలనీలకు తీవ్ర వరద ముప్పు సంభవిస్తుందని కమిషనర్ రంగనాథ్‌కు వారు క్షేత్రస్థాయి పరిస్థితిని వివరించారు. ఈ వరద నీరంతా నివాస ప్రాంతాల్లోకి రాకుండా నేరుగా చెరువుకు చేరేలా చర్యలు తీసుకోవాలని, లోపభూయిష్టంగా ఉన్న ఇంజనీరింగ్ పనులను సరిదిద్ది సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన హైడ్రా కమిషనర్, ఈ సమస్యను తక్షణమే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కాలనీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.



# ఘనంగా డా శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

## నివాళులర్పించిన బీజేపీ మండల శాఖ

**సంస్థాన్ నారాయణపురం, జూన్ 23(హైదరాబాద్ మిర్రర్) :**

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, గొప్ప జాతీయవాది నాయకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని మంగళవారం సంస్థాన్ నారాయణపురం మండల భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షులు సుర్వి రాజు గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి మాట్లాడుతూ, దేశ సమైక్యత, సమగ్రత కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని పేర్కొన్నారు. "ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిశాన్ నహీ చలేగా" అనే నినాదంతో జమ్మూ కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమని చాటిచెప్పి, ప్రత్యేక ప్రతిపత్తికి వ్యతిరేకంగా చివరి వరకు పోరాడిన మహోన్నత నాయకుడు అని కొనియాడారు. ఆయన ఆశయాల స్ఫూర్తితోనే జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు సాధ్యమైందని అన్నారు.అనంతరం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు పిట్టల శీను,ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కల రాజు యాదవ్, బీజేపీ జిల్లా నాయకులు వంగరి రఘు, మండల నాయకులు కోడూరు బీరప్ప,సంగిశెట్టి లక్ష్మీనారాయణ,అంతటి సురేష్ గౌడ్, గుండు జంగయ్య గౌడ్, గుండు లింగస్వామి గౌడ్, గుండు శివరామరాజు గౌడ్, అంతటి నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులపై ప్రేమ ఉంటే రాజకీయాలు కాదు,

# వారి సమస్యలపై పోరాడాలి

## తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గొల్ల జాన్

**కూకట్ పల్లి, జూన్ 23 (హైదరాబాద్ మిర్రర్) :**

తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు అందలేదనే కారణంతో ఏబీవీపీ మంగళవారం బంద్‌కు పిలుపునివ్వడం విచారకరమని తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గొల్ల జాన్ అన్నారు. ఈ సందర్భంగా గొల్ల జాన్ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన నీట్ పేపర్ లీక్ ఘటనపై ఎందుకు నోరు మెదపలేదని అన్నారు.విద్యార్థులు ఆందోళనకు గురైనప్పుడు ఎన్ టి ఏ వైఫల్యాల వల్ల వారి కలలు చిద్రమైనప్పుడు ఏబీవీపీ నాయకులు ఎక్కడ ఉన్నారని ఆయన ప్రశ్నించారు. ఎందుకు ఎన్ టి ఏ ను రద్దు చేయాలని డిమాండ్ చేయలేదు? ఎందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించలేదని అన్నారు.తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ తరపున మేము స్పష్టంగా చెబుతున్నాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆధునిక సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తోందని, విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధే మా ప్రధాన లక్ష్యం అని తెలిపారు.ఏబీవీపీ నాయకులు నిజంగా విద్యార్థుల పక్షాన ఉంటే, ప్రతి సంవత్సరం జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని, అనవసర రాజకీయ డ్రామాలకు బదులుగా విద్యార్థుల హక్కుల కోసం కలిసి పోరాడాలని, విద్యార్థుల ప్రయోజనాల కోసం ఎన్ ఎస్ యు ఐ ఎప్పటికీ ముందుంటుందని అన్నారు.



# చలో భువనగిరి సమరభేరి సభను విజయవంతం చేయండి: నవాజ్

**సంగారెడ్డి, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 23:**

జూలై 5న భువనగిరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో భువనగిరి సమరభేరి సభ ను విజయవంతం చేయడానికి సంగారెడ్డి లో ఆ పార్టీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. మంగళవారం సంగారెడ్డి లో ఇంటింటికి తిరుగుతూ సభకు రావాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ నవాజ్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మరియు అణగారిన వర్గాల హక్కుల సాధన లక్ష్యంగా ఈ సమరభేరి సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత కోసం జరుగుతున్న ఈ కార్యక్రమానికి ప్రజలు, యువత, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టిఆర్పి రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు రవి నాయక్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రేమలత, మున్‌పల్లి మండల అధ్యక్షుడు యూసుఫ్, సంగారెడ్డి టౌన్ అధ్యక్షుడు రవి, సీనియర్ నాయకుడు గడ్డం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# అదనపు కట్నం వేధింపులు

## అత్తగారింటి ముందు కోడలు టెంట్ వేసి ధర్నా

**మేడ్చల్,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని కైలాష్ హిల్స్‌లో ఓ మహిళ తన అత్తగారింటి ముందు టెంట్ వేసుకుని ధర్నాకు దిగిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. జయశ్రీ (25) అనే మహిళ తన భర్త, అత్తమామల వేధింపులు భరించలేక ఈ నిరసనకు దిగినట్లు తెలిపింది.బాధితురాలి కథనం ప్రకారం, వివాహ సమయంలో రూ.10 లక్షల కట్నంతో పాటు ఐదు కిలోల వెండి, బంగారు ఆభరణాలు ఇచ్చినప్పటికీ, అదనపు కట్నం కోసం భర్త కుటుంబ సభ్యులు నిరంతరం వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించింది.

# సతీష్ రెడ్డి వ్యాఖ్యలు అర్ధరహితం

**మంగపేట,జూన్23,హైదరాబాద్ మిర్రర్**



ట్రైబల్ సొసైటీల పై సతీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవగాహన లేకుండా అర్ధరహితంగా ఉన్నాయని పెసా ములుగు జిల్లా అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు ఆరోపించారు.డిసిల్టేషన్ పై అనుమతి పొందిన ఇసుక క్వారీలతో రూ,4000 కోట్ల స్కాం ఎలా జరిగిందో ఆధారాలు చూపించాలన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఎలాంటి ఇసుక అయినా అమ్మే అధికారం కేవలం టీజీఎండీసీ కే ఉందని అది బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీనేనని ఇసుక తీయడం నుంచి లోడింగ్ చేయడం వరకు మాత్రమే కాంట్రాక్టర్లు,సొసైటీలు టీజీఎండీసీ నుంచి వర్క్ ఆర్డర్ తీసుకుని పని చేస్తారనే విషయం తెలుసుకోవాలన్నారు. ఒక ట్రైబల్ సొసైటీ క్వారీకి క్యూబిక్ మీటర్‌కు రూ,146 ఇస్తారని అందులో రూ,30 గిరిజన సొసైటీ సభ్యులకు బోనస్ రూ,116 ఇసుక తీయడం లోడింగ్ ఖర్చులకే సరిపోతుందని ఇందులో రూ,4,000 కోట్లు ఎలా వస్తాయో సమాధానం చెప్పాలని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క టన్ను ఓవర్‌లోడ్ గానీ, జీరో లోడ్ ఎలా వెళ్లిందో నిరూపించాలని లేకుంటే రాష్ట్రంలోని గిరిజన సొసైటీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.గత మీ ప్రభుత్వంలో ఇసుక పని చేసి సంపాదించిన రూ,100 కోట్ల బిల్లులు ఇవ్వకుండా మీ ప్రభుత్వం గిరిజనులను మోసం చేసిందని దానికి సమాధానం చెప్పాలని అన్నారు.మండలంలో సీతమ్మ సాగర్ బ్యారేజి ముంపు గ్రామాలు లేవనేది వాస్తవం కాదని ఇసుకను ప్రాజెక్ట్ సబ్‌మర్జెన్సీ ఏరియా వరకు మాత్రమే తీస్తారనే విషయం తెలియక పోవడం నీ హాఫ్ నాలెడ్జి నిదర్శనం అన్నారు.మీ ప్రభుత్వంలో అన్నారం,మేడిగడ్డ బ్యారేజీలు నిర్మించాక ఇసుక తీసిందా లేక కట్టే ముందు తీసిందా తెలుసుకోని మాట్లాడాలన్నారు.అన్ని నిబంధనలు పూర్తి చేసి సంబంధిత శాఖల అనుమతులు వేగంగా చట్టబద్ధంగా వచ్చి గిరిజన సొసైటీలకు ఉపాధి అవకాశాలు కల్పించడం నేరంగా చూడద్దని మండిపడ్డారు.గిరిజనుల అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలను విమర్శించే కంటే మీ ప్రభుత్వం గిరిజన సొసైటీల బిల్లులు ఎందుకు పెండింగ్‌లో పెట్టిందో సమాధానం చెప్పాలని అన్నారు.ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం మానేసి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం మానుకోవాలని హెచ్చరించారు.

# 12 సంవత్సరాల మోడీ పాలనలో ప్రజలకు కష్టాలు తప్ప ఒరిగిందేమీ లేదు

## సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ

**భువనగిరి, జూన్ 23(హైదరాబాద్ మిర్రర్):**

కేంద్రంలో నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు పూర్తయిన ప్రజల జీవితాల్లో మార్పు లేవని ప్రజలకు మేలు కంటే కష్టాలే ఎక్కువగా ఎదురయ్యాయని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ విమర్శించారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్, భువనగిరిలో సీపీఎం భువనగిరి మండల కమిటి ఆధ్వర్యంలో " 12 సంవత్సరాల మోడీ పాలన - వైఫల్యాలు " పై సదస్సు జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ అధ్యక్షతన జరగగా ఈ సదస్సుకు ముఖ్య అతిధులుగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ మోడీ ఎన్నికల ముందు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన హామీ అమలు కాలేదని దేశంలో నిరుద్యోగ సమస్య మరింత పెరిగిందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ ప్రైవేటీకరణ చేయడం వల్ల శాశ్వత ఉద్యోగ అవకాశాలను తగ్గిపోయాయని విమర్శించారు. యువత ఉపాధి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. వ్యవసాయ రంగంలో రైతులు, వ్యవసాయ కార్మికులు అనేక సమ స్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాలు, డీజిల్ ధరలు పెరగడంతో సాగు ఖర్చులు భారీగా పెరిగాయని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో వ్యవసాయ కార్మికుల జీవనం దుర్భరంగా మారిందని తెలిపారు. నిత్యావసర వస్తువులు, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరిగిందని పేదలు, మధ్యతరగతి కుటుంబాల పోషణకే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జీఎస్టీ, నోట్ల రద్దు వంటి నిర్ణయాల వల్ల చిన్న వ్యాపారులు, చిరు వ్యాపారులు, అసంఘటిత రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. సంపద కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకృతమవుతుండగా, పేదరికం,




అసమానతలు రోజు రోజుకు పెరుగుతున్నాయని అన్నారని. మోడి నాలుగు లేబర్ కొడ్ల ను, విబి- జీ రాంజీ చట్టం, విత్తన చట్టం, విద్యుత్ సవరణ బిల్లు ద్వారా అన్ని వర్గాల ప్రజలు మోసం చెస్తున్నారని విమర్శించారు. మోడి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు తిరుగు బాటు చేయాలని నర్సింహ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు ఏదునూరి మల్లేశం, అన్నంపట్ల కృష్ణ, ప్రజా సంఘాల జిల్లా నాయకులు ఈర్లపల్లి ముత్యాలు, లావుడియ రాజు, వడ్డెబోయిన వెంకటేష్, మండల కమిటీ సభ్యులు పాండాల మైసయ్య, మోటే ఎల్లయ్య , కొండపురం యాదగిరి, మద్యపురం బాల్ నర్సింహ, కళ్లేం లక్ష్మి నరసయ్య, శాఖ కార్యదర్శులు బోడ ఆంజనేయులు, ఏదునూరి వెంకటేష్, కొల్లూరి సిద్ధిరాజు, కడారి కృష్ణ, నాయకులు నరాల చంద్రయ్య, దయ్యాల మల్లెష్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ల పనితీరుపై డీఐజీ సమీక్ష

## పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలి

## ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలి: ఎల్.ఎస్. చౌహాన్

**సంగారెడ్డి, హైదరాబాద్ మిర్రర్ జూన్ 23:**

వార్షిక తనిఖీలలో భాగంగా జోగులాంబ జోన్-7 డీఐజీ, చార్మినార్ జోన్-6 ఇన్‌చార్జ్ ఎల్.ఎస్. చౌహాన్ మంగళవారం సంగారెడ్డి మహిళా పోలీస్ స్టేషన్, సీసీఎస్, హత్నూర పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేసిన డీఐజీ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, మిస్సింగ్ కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి త్వరితగతిన చేధించాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్-2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్ వంటి సాంకేతిక వ్యవస్థలపై పూర్తి అవగాహన పెంపొందించుకుని నేరాల నియంత్రణలో సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి, వారి సమస్యలను ఓపికగా విని తగిన పరిష్కారం చూపుతామనే భరోసా కల్పించాలని తెలిపారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు ఫైళ్లను నిర్ణీత గడువులోగా సీసీటీఎన్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. సంగారెడ్డి జిల్లా పరిశ్రమలకు కేంద్రంగా ఉండటంతో ఆర్థిక, ఆస్తి సంబంధిత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధిక నేరాలు నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి నిఘా పెంచాలని సూచించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్‌హెచ్‌వోలకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణ కోసం కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతిరోజూ వాహనాల తనిఖీలు చేపట్టి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సిబ్బందితో




సమావేశమైన డీఐజీ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పోలీస్ స్టేషన్ల నిర్వహణ, రికార్డుల మెయింటెనెన్స్ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ తనిఖీలలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు సత్యయ్య గౌడ్, ప్రభాకర్, ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సిగాచి బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం: ఆదర్శ్ రెడ్డి

- జూన్ 30న సంస్మరణ సభతో ప్రభుత్వాన్ని నిలదీయనున్న బీఆర్ఎస్
- సిగాచీ బాధితులకు ప్రకటించిన పూర్తి పరిహారం ఎందుకు అందలేదు.?
- ఏడాది గడిచినా బాధిత కుటుంబాలకు న్యాయం జరగకపోవడం దురదృష్టకరం
- కార్మికుల ప్రాణాలకు విలువ లేదా? ప్రభుత్వం వెంటనే స్పందించాలి
- పరిహారం హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయా?
- బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత
- దోషులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఇలాంటి ఘటనలు మళ్లీ జరుగుతాయి
- పరిహారం ఆలస్యం బాధిత కుటుంబాల వేదనను మరింత పెంచుతోంది
- ప్రభుత్వం మాట నిలబెట్టుకొని బాధిత కుటుంబాలకు తక్షణమే పూర్తి సహాయం అందించాలి





**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 23:**

సిగాచీ పరిశ్రమలో జరిగిన ఘోర పేలుడు ఘటన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే పూర్తి నష్టపరిహారం చెల్లించాలని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్, ఇస్నాపూర్ చైర్మన్ శ్రీకాంత్ యాదవ్ డిమాండ్ చేశారు. ఘటనలో 54 మంది మృతి చెందగా, పలువురు గాయాలపాలై చికిత్స పొందుతూ మరణించారని, ఇంకా కొందరి ఆచూకీ తెలియరాలేదని పేర్కొన్నారు. ఘటనకు ఏడాది పూర్తవుతున్నప్పటికీ బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రకటించిన రూ. కోటి పరిహారం అందలేదని, కేవలం రూ.25 లక్షలు మాత్రమే చెల్లించారని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పరిహారం చెల్లింపులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, వారం రోజుల్లోగా పూర్తి పరిహారం అందించకపోతే తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మాజీ మంత్రి హరీష్ రావు ఆదేశాల మేరకు జూన్ 30న సిగాచీ పరిశ్రమ పేలుడు బాధితులతో కలిసి సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో మృత కార్మికులకు నివాళులర్పించి, బాధిత కుటుంబాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. అదేవిధంగా ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఆరోపించిన బీఆర్ఎస్ నేతలు, ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రైతులతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఇస్నాపూర్ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ కణతాల వెంకటేశ్వర్లకు పితృవియోగం

**ఖమ్మం, హైదరాబాద్ మిర్రర్**



ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన జర్నలిస్టు కణతాల వెంకటేశ్వర్లు ( క్రైమ్ మిర్రర్ దినపత్రిక జిల్లా రిపోర్టర్ ) వారి తండ్రి కణతాల పుల్లయ్య (65) ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కణతాల పుల్లయ్యకు భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు. జర్నలిస్టు కణతాల వెంకటేశ్వర్లు కి పితృవియోగం పట్ల టిడబ్ల్యు జే ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి , గరిడేపల్లి వెంకటేశ్వర్లు (నవతెలంగాణ ), తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) జిల్లా అధ్యక్షులు జి నాగ స్వామి జర్నలిస్టులు సయ్యద్ ఖాసిం, తాళ్లపల్లి అశోక్, ఓదార్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కణతాల పుల్లయ్య కు కాంగ్రెస్ నాయకులు సిపిఎం, బి ఆర్ ఎస్ నాయకులు డివైఎఫ్ఐ నాయకులు జర్నలిస్టులు నివాళులర్పించారు.

# అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

## నిర్లక్ష్యపు కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలి

## రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జే అరుణశ్రీ

**రామగుండం,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలనీ, పనుల్లో జాప్యం, నిర్లక్ష్యం చేసే కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జే అరుణశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలోని వివిధ పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పనుల నాణ్యత విషయంలో రాజీపడేది లేదన్నారు. క్షేత్ర స్థాయిలో పని పూర్తయిన తర్వాత సైట్ క్లియర్ చేసి రాకపోకలకు ఏలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చే అవకాశం లేకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని అన్నారు. తగిన కారణం లేకుండా పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో నగర పాలక సంస్థ ఏఈ తేజస్విని, అన్వేష్, టెక్నికల్ ఆఫీసర్ సౌమ్య, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ

## బీబీనగర్ 46 పోలింగ్ కేంద్రాలకు బిఎల్‌వోల నియామకం

**హైదరాబాద్,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు బీబీనగర్ మండలంలోని 46 పోలింగ్ కేంద్రాలకు బూత్ లెవల్ అధికారులను (బీఎల్‌వోలు) నియమించినట్లు తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఎల్‌వోల పనితీరును పర్యవేక్షించేందుకు నలుగురు బీఎల్‌వో సూపర్‌వైజర్లను నియమించినట్లు పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ మేరకు జూన్ 25 నుండి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా నింపేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నట్లు చెప్పారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటరు వివరాల సవరణలు, చిరునామా మార్పులు, కుటుంబ సభ్యుల వివరాల ధృవీకరణ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. మండలంలోని గూడూరు, జైనపల్లి, కొండమడుగు, జియ్యాపల్లి, మహాదేవ్‌పూర్, రాయరావుపేట, నేమారుగొమ్ముల, వెంకిర్యాల, రుద్రవెల్లి, రాఘవాపురం, బ్రాహ్మణపల్లి, భట్టుగూడెం, బీబీనగర్‌తో పాటు వివిధ గ్రామాల్లో ఈ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమకు సంబంధించిన బీఎల్‌వోలను సంప్రదించి ఓటరు జాబితాలో అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# రామగుండం అభివృద్ధికి సహకరించండి

## ప్రిన్సిపల్ సెక్రటరీకి రామగుండం మేయర్ వినతి

**హైదరాబాద్,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

రామగుండం నగర అభివృద్ధికి సహకరించాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ టీ.కే.శ్రీదేవిని నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో ని ఒక హోటల్లో మున్సిపల్ చైర్మన్, కార్పొరేషన్ మేయర్లకు మంగళవారం నిర్వహించిన ఓరియంటేషన్ కు రామగుండం మేయర్ స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా పురపాలక శాఖ సెక్రెటరీని కలిసి నగరంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించినట్లు తెలిపారు. ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణలో రామగుండం కార్పొరేషన్ ఆధ్వర్యంలో బయో మైనింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి సహకరించాలనీ, అలాగే పనికి రావనుకున్న వాటి నుంచి కూడా అద్భుతాలు సృష్టించే వస్తువుల తయారీ వేస్ట్ టు వండర్ యూనిట్లు స్వశక్తి మహిళల ద్వారా స్థాపించడానికి అవసరమైన ప్రోత్సాహాన్ని అందించాలని కోరినట్లు తెలిపారు. మెరుగైన సేవలందించడానికి జనాభాకు తగినట్టుగా పారిశుధ్య సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారని మేయర్ తెలిపారు.

# 12వ వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలి

## సింగరేణి జాతీయ కార్మిక సంఘాల డిమాండ్

**గోదావరిఖని,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

బొగ్గు గని కార్మికుల 12వ వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణిలో నాలుగు జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టనున్నట్టు నాయకులు వెల్లడించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్టీయూసీ నాయకులు జనక్ ప్రసాద్, సీఐటీయూ నాయకులు రాజారెడ్డి హెచ్ఎంఎస్ నాయకులు మాట్లాడారు. జూన్ 30 2026 తో 11వ వేతన ఒప్పంద కాల పరిమితి ముగుస్తుందని 1 జులై 2026 నుంచి 12వ వేతన ఒప్పందం అమలు కావాల్సి ఉండగా ఇప్పటివరకు కమిటీ వేయలేదని నాయకులు విమర్శించారు. కోల్ ఇండియాలో జులై 1న నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిన క్రమంలో సింగరేణి సంస్థలు జూలై 3న కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు నాలుగు జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

# 60 ఏళ్ల ప్రయాణంలో శివసేన అంతర్ధాన దశ

## ఉద్ధవ్ స్వయంకృతంతో పార్టీకి ముప్పు

## తండ్రి ఆశయాలు కాపాడడంలో పూర్తిగా విఫలం

**ముంబై,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

మహారాష్ట్రలో బలంగా నిలిచిన శివసేన కథ ఇంక కంచికేనా అన్న చర్చ సాగుతోంది. బాణంలా దూసుకుని వచ్చిన బాల్ ఠాక్రే స్థాపించిన 'శివసేన' సరిగ్గా 60 వసంతాలు పూర్తి చేసుకుని వజ్రోత్సవ వేడుకలకు సిద్ధం అవుతున్న వేళ.. అంతర్ధానానికి దగ్గరవుతోంది. యాదృచ్ఛికమే అయినా 60 వసంతాల పార్టీ ఇలా కావడం స్వయంకృతమే. 1966 జూన్ 19న ముంబైలోని చారిత్రాత్మక శివాజీ పార్క్‌లో బాల్ ఠాక్రే కొబ్బరికాయ కొట్టి ఈ పార్టీని ప్రారంభించారు. నాడు కొద్దిమంది మద్దతుదారులు, వేలాది మంది 'మరాఠీ మానుస్' సాక్షిగా పురుడుపోసుకున్న ఈ ప్రాంతీయ మహావృక్షం.. రెక్కలు విరిగాయి. నేలకొరగడానికి సిద్ధంగా ఉంది. విచిత్రమేమిటంటే.. బాల్ ఠాక్రే స్థాపించిన అసలైన 'శివసేన' పేరు, దాని సాంప్రదాయక 'విల్లు-బాణం' గుర్తు ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే వశమయ్యాయి. మరోవైపు ఉద్ధవ్ ఠాక్రే వద్ద తండ్రి పెట్టిన పార్టీ పేరు కానీ, గుర్తు కానీ మిగల్లేదు. వారి పార్టీ ఇప్పుడు 'శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే)'గా రూపాంతరం చెంది, 'మశాల్' (దివిటీ) గుర్తుతో మనుగడ సాగిస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆ దివిటీ సైతం దాదాపు ఆరిపోయే స్థితికి చేరుకుంది. శివసేనను స్థాపించినప్పుడు బాల్ ఠాక్రే రెండు ప్రధాన ఆశయాలను నిర్దేశించుకున్నారు. ఒకటి 'మరాఠీ అస్తిత్వం', రెండోది 'హిందుత్వ సిద్ధాంతం'. కానీ నేడు ఉద్ధవ్ ఠాక్రే తన తండ్రి నుంచి వచ్చిన ఈ రెండు రాజకీయ వారసత్వాలను కాపాడుకోవడానికి తీవ్రంగా పోరాడాల్సి వస్తోంది. బాల్ ఠాక్రే హయాంలో శివసేన సాధించిన శిఖరాగ్రాల నుంచి ఉద్ధవ్ హయాంలో ఎదుర్కొంటున్న జీవన్మరణ పరిస్థితి వరకు అనేక ఆటుపోట్లు ఎదుర్కొంది. 1992 జూలై 18న శివసేనలో జరిగిన ఘటన సంచనలంగా మారింది. బాల్ ఠాక్రే పార్టీని ఒక సొంత ఆస్తిలా చూస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో కలత చెందిన బాల్ ఠాక్రే, పార్టీ ముఖపత్రం 'సామ్నా'లో ఒక వ్యాసం రాస్తూ.. తాను శివసేన నుంచి తప్పుకుంటున్నట్లు సంచలన ప్రకటన చేశారు. ఈ వార్తతో మహారాష్ట్రవ్యాప్తంగా ఉన్న శివసైనికుల్లో తీవ్ర కలకలం రేగింది. ముంబైలోని శివసేన ప్రధాన కార్యాలయం వెలుపల లక్షలాది మంది సైనికులు తరలివచ్చి.. 'బాలాసాహెబ్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి' అని కన్నీటితో వేడుకున్నారు. శివసైనికులకు తనపై ఉన్న ఆ అచంచలమైన ప్రేమాభిమానాలను చూసి బాల్ ఠాక్రే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోక తప్పలేదు. బాల్ ఠాక్రే బతికున్నంత కాలం మహారాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువు వారి నివాసమైన 'మాతోశ్రీ' మాత్రమే. శివసేన అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. ముంబై నగర రిమోట్ కంట్రోల్ బాలాసాహెబ్ చేతుల్లోనే ఉండేది. 'మాతోశ్రీ' నుంచి చిన్న సంకేతం వస్తే చాలు.. ముంబై స్థంభించిపోయేది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం స్వయంగా ముంబై పోలీసులు సైతం శివసేన ప్రముఖుడిని అభ్యర్థించాల్సిన పరిస్థితి ఉండేది. కోవిడ్ లాక్‌డౌన్ కంటే ముందే.. ముంబై లోకల్ రైళ్లకు బ్రేక్ వేయగల ఏకైక శక్తి బాల్ ఠాక్రేకే ఉండేదని ఇప్పటికీ ముంబై ప్రజలు చెప్పుకుంటారు. కానీ, నేడు బాల్ ఠాక్రే శతాబ్ది జయంతి ఉత్సవాల వేళ, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని పార్టీ రెండోసారి ఘోరమైన చీలికను ఎదుర్కొంటోంది. ఆయన కుడిభుజం



లాంటి సంజయ్ రౌత్ కేవలం ప్రత్యర్థులపై వీధి రౌడీల తరహాలో విమర్శలు చేయడానికే పరిమితమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాల్ ఠాక్రేకు, ఉద్ధవ్ ఠాక్రేకు రాజకీయ వ్యూహాల్లోనూ, వ్యక్తిత్వంలోనూ నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. బాల్ ఠాక్రే తన జీవితంలో ఎన్నడూ అధికార పీఠాన్ని ఆశించలేదు. ఆయన ఎప్పుడూ 'కింగ్' అవ్వాలని అనుకోలేదు, 'కింగ్‌మేకర్' గానే ఉండటానికి ఇష్టపడ్డారు. శివసైనికులు బాలాసాహెబ్ కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధపడ్డారంటే.. ఆయన దశాబ్దాల పాటు క్షేత్రస్థాయిలో చేసిన పోరాటమే దానికి కారణం. 2003 నుంచి పార్టీలో ఉద్ధవ్ జోక్యం పెరిగిన తర్వాత, శివసేన ఏకంగా నాలుగు సార్లు పెద్ద తిరుగుబాట్లను చవిచూసింది. ఉద్ధవ్‌పై తిరుగుబాటు చేసిన ప్రతి ఒక్కరి వాదన ఒక్కటే.. ఆయనలో బాల్ ఠాక్రే లక్షణాలు ఏమాత్రం లేవని, అయినా సరే అందరూ తనను బాలాసాహెబ్‌లాగే గౌరవించాలని ఉద్ధవ్ ఆశిస్తారని అసమ్మతి నేతలు ఆరోపిస్తుంటారు. బీజేపీతో కలిసి ఎన్నికల్లో గెలిచిన తర్వాత, ఉద్ధవ్ ఠాక్రే అనూహ్యంగా ప్లేట్ ఫిరాయించి కాంగ్రెస్, ఎన్సీపీలతో చేతులు కలిపి స్వయంగా ముఖ్యమంత్రి అయ్యారు. అంతేకాకుండా తన సొంత మంత్రివర్గంలో కొడుకు ఆదిత్య ఠాక్రేకు మంత్రి పదవి కట్టబెట్టారు. ఉద్ధవ్ నిర్ణయాలపై ఆయన భార్య రష్మి ఠాక్రే, కుమారుడు ఆదిత్య ఠాక్రే, సంజయ్ రౌత్‌లతో కూడిన ఒక ప్రత్యేక కోటరీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఇది బాలాసాహెబ్ ఇమేజ్ ముందు ఉద్ధవ్‌ను బలహీనంగా మార్చేసిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తారు. బాల్ ఠాక్రే బతికుండగానే జరిగిన మొదటి తిరుగుబాటు ఇది. భుజబల్ ఆ తర్వాత కాంగ్రెస్, ఎన్సీపీల ద్వారా రాజకీయాల్లో కొనసాగారు. విచిత్ర మేమిటంటే, ఆ తర్వాత కాలంలో అదే భుజబల్‌ను ఉద్ధవ్ తన మంత్రివర్గంలో చేర్చుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు ఏక్‌నాథ్ షిండేతో మొత్తం శివసేన రూపం మారిపోయింది. అసపలు శివసేనకు షిండే నాయకుడయ్యారు. ఇటీవల ఆరుగురు ఎంపీలు కూడా వెళ్లిపోవడంతో ఉద్ధవ్ శివసేన మరింత బలహీనపడింది.

# కేతన్ అగర్వాల్ మర్డర్ కేసులో షాకింగ్ విషయాలు

## ప్రియుడితో కలసి కాబోయే భార్య సియా మర్డర్ ప్లాన్

## లోయలోకి తోసి హత్య చేసినట్లు పోలీసుల నిర్ధారణ

## సియాను, ప్రియుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**ముంబై,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

మహారాష్ట్రకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త విశాల్ అగర్వాల్ కుమారుడు కేతన్ అగర్వాల్ మర్డర్ కేసులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కాబోయే భార్య సియా, ఆమె ప్రియుడు చేతన్ చౌదరీలు కలిసే కేతన్‌ను లోయలోకి తోసేసినట్లు పోలీసులు తేల్చారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నాతాధికారులు సైతం విచారం వ్యక్తం చేస్తున్నారు. కేతన్ అగర్వాల్‌కు సియా గోయల్ అనే అమ్మాయితో కొన్ని రోజుల క్రితం పెళ్లి నిశ్చయం అయింది. నవంబర్‌లో పెళ్లి జరగాల్సి ఉంది. గురువారం సియా పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా సియ, కేతన్ లోనావాలాకు ట్రెక్కింగ్‌కు వెళ్లారు. లోహగడ్ కోటకు వెళుతుండగా కేతన్ లోయలో పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫొటోలు దిగుతుండగా ప్రమాదవశాత్తు కేతన్ లోయలో పడిపోయాడని సియా పోలీసులకు చెప్పింది. 3 గంటల రెస్క్యూ ఆపరేషన్ తర్వాత లోయలో కేతన్ శవాన్ని కనుగొన్నారు. పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. లోనావాలా రూరల్ పోలీసులు సియాను విచారించగా.. ఆమె పొంతన లేని సమాధానాలు చెప్పటం మొదలెట్టింది. దీంతో పోలీసులకు ఆమెపై అనుమానం వచ్చింది. మొబైల్ డేటా, కాల్ రికార్డ్స్ సేకరించటంతో పాటు సంఘటనా స్థలంలో ఉన్న జనాలను విచారించారు. దీంతో ఆమెపై అనుమానం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలోనే సియాను, ఆమెను ప్రియుడిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అసలు విషయం బయటపడింది. సియా, ఆమె ప్రియుడు చేతన్ చౌదరీలు పక్కా ప్లాన్‌తో కేతన్‌ను మర్డర్ చేసినట్లు తేలింది. ఇద్దరూ కలిసి కేతన్‌ను లోయలో తోసేశారని వెల్లడైంది. ఈ మర్డర్ ఇద్దరే చేశారా? లేక వారికి ఎవరైనా సహకరించారా? అన్న కోణంలో కూడా పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు చెబుతున్న దాని ప్రకారం.. కేతన్‌ను పెళ్లి చేసుకోవటం సియాకు ఏమాత్రం ఇష్టం లేదు. ఆమె చేతన్ చౌదరీని ప్రేమిస్తోంది. ఇద్దరూ ఒకే ఆఫీస్‌లో కలిసి పని చేస్తున్నారు. ప్రియుడి సాయంతో కేతన్ అడ్డు తొలగించుకోవాలని ఆమె భావించింది. ఈ నేపథ్యంలోనే ఇద్దరూ పక్కా ప్లాన్ వేసుకున్నారు. సియా తన పుట్టిన రోజున కేతన్‌ను లోహగడ్‌కు ట్రెక్కింగ్‌కు తీసుకెళ్లింది. సరైన సమయం దొరకగానే తన ప్రియుడు చేతన్ సాయంతో కేతన్‌ను లోయలోకి తోసేసింది. కేతన్ ప్రమాదవశాత్తు లోయలో పడిపోయాడని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసింది. దర్యాప్తులో ఆమె చేసిన నేరం బయటపడింది.కొడుకు పెళ్లి కోసం విశాల్ అగర్వాల్ ఇప్పటికే 20 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. పెళ్లి నవంబర్ నెలలో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరగాల్సి ఉంది. విశాల్ 17 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి పెళ్లి కోసం ఇప్పటికే ప్యాలెస్ బుక్ చేశాడు. అంతేకాదు.. బంధుమిత్రులను, అతిథులను తరలించడానికి విమానాలను కూడా బుక్ చేశాడు. పెళ్లికి ఇంకా ఐదు నెలలు ఉన్నా కూడా ఇప్పటినుంచే రెండు కుటుంబాల వారు పెళ్లి పనులు మొదలెట్టారు. సియా చేసిన దారుణం కారణంగా రెండు కుటుంబాల వారు షాక్‌లో ఉన్నారు.

# మూతపడ్డ రామగుండం థర్మల్ ప్లాంట్ సందర్శన

## అధికారులతో కసలి యంత్రాలు పరిశీలించిన నవీన్ మిట్టల్

**రామగుండం,జూన్ 23(హైదరాబాద్ మిర్రర్):**

రామగుండంలో మూతపడిన 62.5మెగావాట్ల బీ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని తెలంగాణ ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్ సందర్శించారు. రాష్ట్ర జెన్కో సీఎండీ ఎస్ హరీశ్, థర్మల్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజశేఖరెడ్డితో కలిసి ప్లాంటును సందర్శనతో యంత్రాలను మంగళవారం పరిశీలించారు. పనికి వచ్చే యంత్రాల జాబితాను తయారు చేయాలని సూచించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమీక్ష సమావేశంలో ఈ ప్లాంటు స్థానంలో కొత్తగా చేపట్టనున్న 800మెగావాట్ల ప్లాంటు నిర్మాణంకు కావాల్సిన వనరులపై ఇంజినీర్లతో సమీక్ష చేశారు. పాత ప్లాంటుకు చెందిన భూమి, కొత్త ఎ÷-లాంటు నిర్మాణంకు ఇంకాను ఏ మేరకు ప్రభుత్వ, ప్రవేటు స్థల సేకరణ అంశాలు, కొత్త ఎ÷-లాంటుకు చెందిన డీపీఆర్పై చర్చించారు. అలాగే ఎ÷-లాంటు మెటీరియల్ను వెస్ట్ చేయకుండా ఇతర జెన్కో పవర్ ప్లాంటులకు తరలించాలని సూచించారు. అనంతరం ఎన్టీపీసీ థర్మల్ పవర్ స్టేషన్ను ప్రత్యేక కార్యదర్శి సందర్శించారు. విద్యుదుత్పత్తి నమోదు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యదర్శిని రామగుండం నగరపాలక డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు కలిసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాల కోసం 800మెగావాట్ల విద్యుత్ కేంద్రం నిర్మాణ పనులను వేగంతం చేయాలని విన్నపించారు.

# భూసర్వేకు రైతులు సహకరించాలి

## అదనపు కలెక్టర్ బీఎస్ లత

**కరీంగనర్,జూన్ 23(హైదరాబాద్ మిర్రర్):**

గ్రామంలో చేపట్టే భూసర్వేకు రైతులు సహకరించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. బీర్పూర్ మండలంలోని కొమన్ పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని డొంకేశ్వరం గ్రామంలో భూభారతి భూ రీసర్వే చేపట్టడం కోసం మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత భూ సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో గ్రామానికి చుట్టు హద్దులు ఏర్పాటు చేసి గ్రామంలోని ప్రతీ రైతుకు చెందిన భూమిని సర్వేయర్ల ద్వారా కొల్వనున్నామని, దీనికి రైతులందరూ సహకరించాలని కోరారు. గ్రామంలో ఏ రైతుకు చెందిన భూములు ఎప్పుడు కొలుస్తారో సమాచారం ఇస్తారని, అప్పుడు ఆ రైతులు అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాని అన్నారు.రైతులకు ఏమైన సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూధన్, తహసీల్దార్ సుజాత, డిప్యూటీ తహసీల్దార్ బొమ్మకంటి శ్రీనివాస్, సర్పంచ్ సీపతి స్వాతి, ఏడీడీఏ, సంబంధిత శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# హర్మూజ్‌పై పట్టుకోసం ఇరాన్ బెట్టు

## అమెరికన్లను ఎప్పుడూ నమ్మబోమన్న ఇరాన్

**టెహ్రాన్,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలోనూ.. హర్మూజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ తరచూ ఏదో ఒక ప్రకటన చేస్తూనే ఉన్నాయి. హర్మూజ్ నిర్వహణను ఇరానే చూస్తుందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ జలసంధి.. యుద్ధానికి ముందున్న స్థితికి ఎప్పటికీ తిరిగిరాదన్నారు. మేం అమెరికన్లను ఎన్నడూ నమ్మలేదు. ఇప్పుడూ నమ్మడం లేదు. భవిష్యత్తులోనూ వారిపట్ల ఆ ధోరణితో ఉండటం సమంజసమే అని ఘాలిబఫ్ అమెరికా పట్ల ఇరాన్‌కున్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లో ఇప్పటికే రెండు దేశాల మధ్య చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఫ్రీజ్ చేసిన 12 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను విడుదల చేయడానికి తుది ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. కాగా.. తమ నుంచి సోయా, మొక్కజొన్న, గోధుమలు కొనేందుకు ఇరాన్ అంగీకరిస్తే.. ఫ్రీజ్ చేసిన ఆ దేశ ఆస్తులను విడుదల చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్మూజ్‌పై భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ పూర్తిగా తెరిచే ఉందని ప్రకటించారు. ఈ జలసంధికి మరోవైపున ఉన్న ఒమన్ దేశం తాజా పరిణామాలపై స్పందించింది. అంతర్జాతీయ చట్టాలకు, టోల్ రహిత ప్రయాణానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయని పేర్కొంది.

# పాక్, ఖతార్‌లను నమ్మలేం

## ఉగ్రవాదానికి ఊతమిచ్చిన ఘనత వారిది

## బిన్‌లాడెన్‌ను దాచిపెట్టిన చరిత్ర పాక్‌ది

## జెడి వాన్స్ వ్యాఖ్యలపై ఇద్దరు సెనేటర్ల విమర్శలు

**వాషింగ్టన్,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

పాకిస్థాన్‌పై ప్రేమను వ్యక్తం చేస్తూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై అమెరికాకు చెందిన ఇద్దరు సెనేటర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ దేశ ఉగ్రచరిత్ర గురించి ప్రస్తావిస్తూ, బిన్ లాడెన్‌ను దాచిన ఘనత పాక్‌దని అన్నారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, ఖతార్ దేశాలపై అమెరికాకు చెందిన ఇద్దరు రిపబ్లికన్ సెనేటర్లు రిక్ స్కాట్, టిమ్ షీహీ ఘాటుగా స్పందించారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన చరిత్ర ఆ దేశాలకు ఉందంటూ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. కాగా, అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందానికి సంబంధించిన సాంకేతిక వివరాలపై స్విట్జర్లాండ్‌లో ఇటీవల చర్చలు జరిగాయి. ఈ సమావేశానికి పాకిస్థాన్, ఖతార్ నాయకులతో వాన్స్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'మేము పాకిస్తాన్‌ను ప్రేమిస్తున్నాం' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. అయితే, ఈ చర్చల్లో పాకిస్థాన్, ఖతార్‌లను నిష్పక్షపాత మధ్యవర్తులుగా చూడకూడదని సెనేటర్ రిక్ స్కాట్ తేల్చి చెప్పారు. మధ్యప్రాచ్యంలో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలే వాషింగ్టన్‌కు నిజమైన మిత్రదేశాలని పేర్కొన్నారు. ఆ దేశాలనూ అమెరికా చర్చల్లో చేర్చుకోవాలని స్కాట్ సూచించారు. 'మన నిజమైన స్నేహితులు ఎవరో ఇప్పటికే అందరికీ స్పష్టంగా తెలిసి ఉండాలి. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన సుదీర్ఘ చరిత్ర ఖతార్, పాకిస్థాన్‌లకు ఉంది. ప్రస్తుతం వారు అర్థవంతమైన శాంతిని సాధించడం కంటే ఇరాన్ దశాబ్దాల నాటి ఉగ్రవాద ప్రచారాన్ని ప్రోత్సహించడానికే మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. అందరికీ ప్రయోజనం చేకూర్చే ఆచరణీయమైన ఒప్పందానికి ఇంకా ఆస్కారం ఉంది' అని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా మోంటానా సెనేటర్ టిమ్ షీహీ కూడా పాకిస్థాన్‌ను విమర్శించారు. 'పాకిస్థాన్ ఒక దశాబ్దం పాటు బిన్ లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చిందనే విషయాన్ని మనం మరిచిపోకూడదు. పాకిస్థానీలు ఐఎస్ఐ ద్వారా మాపై పోరాడే వారికి నిధులు సమకూర్చారు. ముఖ్యంగా అయతుల్లాకు నిధులు అందించారు. ఖతార్ కూడా దశాబ్దాలుగా ఉగ్రవాద సంస్థలకు మనీలాండరింగ్ ద్వారా డబ్బును అందిస్తోంది. ఇరాన్, అమెరికా- ఇజ్రాయెల్ శాంతి ఒప్పందంలో పాకిస్థాన్, ఖతార్‌లు పాల్గొంటే.. ఆ చర్చల్లో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలనూ చేర్చుకోవాలి. మధ్యప్రాచ్యంలో ఆ మూడు దేశాలే అమెరికాకు నిజమైన మిత్రదేశాలు' అని పేర్కొన్నారు. కాగా, వీరి వ్యాఖ్యలు ఇప్పటికే ఉన్న వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లు అయ్యింది.

# అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు

## ఫైలింగ్ ఫీజులను 75శాతం పెంచే యోచన

**వాషింగ్టన్,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు.

# విజయ్‌ను అన్ ఫాలో చేసిన త్రిష

**జూన్ 23(హైదరాబాద్ మిర్రర్)**

కొన్ని నెలలుగా సోషల్ మీడియాలో విజయ్- త్రిష పేర్లు వైరలైన విషయం తెలిసిందే. వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వీరిద్దరూ విడిపోయారని ప్రచారం జరుగుతోంది. జూన్ 22న విజయ్ పుట్టినరోజు కావడంతో సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. విజయ్ సీఎం అయ్యాక తొలి పుట్టినరోజు కావడంతో త్రిష విషెస్ కోసం అందరూ ఎదురుచూశారు. ప్రతి సంవత్సరం ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపే త్రిష మాత్రం ఈసారి ఎలాంటి పోస్ట్ పెట్టకపోవడంతో నెట్టింట కొత్త చర్చ ప్రారంభమైంది. కొన్నేళ్లుగా విజయ్ పుట్టినరోజున ఆయనతో కలిసి దిగిన అరుదైన ఫొటోలను త్రిష పంచుకునే వారు. కానీ, ఈసారి ఆమె మౌనంగా ఉండడంతో పాటు.. ఇన్‌స్టాగ్రామ్‌లో విజయ్‌ను అన్‌ఫాలో చేశారు. దీంతో ఈ అంశంపై నెట్టింట చర్చ జరుగుతోంది.

# అదనపు కట్నం వేధింపులు

## అత్తగారింటి ముందు కోడలు

## టెంట్ వేసి ధర్నా

**మేడ్చల్,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని కైలాష్ హిల్స్‌లో ఓ మహిళ తన అత్తగారింటి ముందు టెంట్ వేసుకుని ధర్నాకు దిగిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. జయశ్రీ (25) అనే మహిళ తన భర్త, అత్తమామల వేధింపులు భరించలేక ఈ నిరసనకు దిగినట్లు తెలిపింది.బాధితురాలి కథనం ప్రకారం, వివాహ సమయంలో రూ.10 లక్షల కట్నంతో పాటు ఐదు కిలోల వెండి, బంగారు ఆభరణాలు ఇచ్చినప్పటికీ, అదనపు కట్నం కోసం భర్త కుటుంబ సభ్యులు నిరంతరం వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించింది. అదనపు డబ్బు తీసుకురావాలని ఒత్తిడి చేయడమే కాకుండా, ఎదురు తిరిగి మాట్లాడితే మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. అంతేకాకుండా, తనపై అసత్య ఆరోపణలు చేస్తూ వ్యభిచారం చేస్తోందంటూ ముద్రవేసి మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొంది. ఈ విషయమై ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో భర్త ఇంటిముందు బంధువులతో కలిసి ధర్నా దిగింది.

# జంటహత్యల కేసులో విస్తుపోయే విషయాలు

స్నేహితుల మధ్య ఇఎంఐ చిచ్చే కారణం

శ్రీధర్‌ను దారుణంగా హత్య చేసిన ప్రభాకర్ తదితరులు

ప్రభాకర్ తండ్రిని మట్టుబెట్టిన శ్రీధర్ బంధువులు

సూరారం గ్రామంలో హత్యలపై పోలీసుల దర్యాప్తు

**మెదక్,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం సురారం గ్రామంలో తీవ్ర కలకలం రేపిన జంట హత్యల కేసులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో ప్రాణ స్నేహితులైన శ్రీధర్, ప్రభు (ప్రభాకర్) మధ్య ఉన్న చిన్నపాటి ఆర్థిక వివాదం, ఆపై కుటుంబ గొడవలే ఈ దారుణ హత్యలకు దారితీశాయి. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. శ్రీధర్, ప్రభు గతంలో అత్యంత సన్నిహితంగా ఉండేవారు. ప్రభు బంధువుల నుంచి శ్రీధర్ ఒక ఆటోను ఈఎంఐ పద్ధతిలో తీసుకున్నాడు. అయితే, రెండు నెలల ఈఎంఐ బకాయిల విషయంలో వీరిద్దరి మధ్య గొడవ మొదలైంది. ఈ క్రమంలోనే గతంలో ప్రభు.. శ్రీధర్‌పై హత్యాయత్నానికి కూడా పాల్పడగా, అప్పట్లో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ గొడవ ఇలా ఉండగానే, శ్రీధర్‌కు వరుసకు చెల్లెలు అయ్యే అమ్మాయిని ప్రభు రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ వివాహంతో ఇద్దరి మధ్య మనస్పర్ధలు, పగ మరింత తీవ్రరూపం దాల్చాయి. ఈ వివాదాలను పరిష్కరించుకోవడానికి ఇద్దరూ ఒకచోట కలుసుకుని మాట్లాడుకుందామని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఒకరికొకరు లొకేషన్లు షేర్ చేసుకున్నారు. ఈ క్రమంలో చేగుంట మండలం అనంతసాగర్ వద్దకు శ్రీధర్ బైక్‌పై రాగానే.. అప్పటికే పథకం ప్రకారం అక్కడ వేచి ఉన్న ప్రభు, అతని స్నేహితులు ఆటోతో శ్రీధర్ బైక్‌ను బలంగా ఢీకొట్టారు. అనంతరం శ్రీధర్‌ను దారుణంగా హతమార్చి అక్కడి నుంచి పరారయ్యారు. కన్నకొడుకు శ్రీధర్ హత్యకు గురయ్యాడనే విషయం తెలవడంతో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు ప్రతీకారంతో రగిలిపోయారు. ప్రభుపై కక్షతో అర్ధరాత్రి వేళ అతని తండ్రి యాదగిరిని టార్గెట్ చేసి దారుణంగా హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు యాదగిరి మృతదేహాన్ని మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామ శివారులోని హల్దీవాగులో పడేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. శ్రీధర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, హల్దీవాగు నుంచి వెలికితీసిన యాదగిరి మృతదేహాన్ని నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ జంట హత్యల నేపథ్యంలో సురారం గ్రామంలో మళ్లీ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో భారీగా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హౌస్ అరెస్టు

రైతు ధర్నాకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

యూరియా యాప్‌ను ఎత్తేయాలన్న వేముల

సకాలంలో యూరియా సరఫరా చేయాలని డిమాండ్

**హైదరాబాద్,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**



మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు నిర్బంధించారు. యూరియా యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా తాడ్వాయి మండలంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి జాజాల సురేందర్ ఆధ్వర్యంలో వేలాది మంది రైతులు ధర్నా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ధర్నాలో పాల్గొనేందుకు వేముల ప్రశాంత్ రెడ్డి బయల్దేరగా.. ముందస్తు చర్యల్లో భాగంగా ఆయన్ను పోలీసులు ఇంటి వద్దే నిలువరించారు. రైతులు యూరియా యాప్ వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సకాలంలో యూరియా దొరకడం లేదనే బాధతో నిరసన కార్యక్రమం చేపట్టారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. రైతుల పిలుపు మేరకు, ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ సురేందర్ నాయకత్వంలో తామంతా అక్కడికి బయల్దేరాలని నిర్ణయించుకున్నామని, అయితే తనను హైదరాబాద్‌లోనే హౌస్ అరెస్ట్ చేయడం చాలా దుర్మార్గమని ఎమ్మెల్యే వేముల మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటువంటి నియంతృత్వ పాలనతో సాధించేదేమీ ఉండదని ఎమ్మెల్యే వేముల హితవు పలికారు. 'మమ్మల్ని అరెస్ట్ చేసి మా గొంతు నొక్కే బదులు, అక్కడ రైతులకు ఇబ్బందిగా మారిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అన్-సీజన్‌లోనే దేశంలో ఎక్కడ యూరియా దొరికినా కొనుగోలు చేసి గోదాముల్లో నిల్వ ఉంచేవారు. రైతులు ఆటో వానికి పైసలు ఇచ్చి పంపిస్తే, నేరుగా పొలాల వద్దకే యూరియా సంచులు వచ్చే పరిస్థితి ఉండేదని , అందుకే రైతన్నలకు ఎలాంటి కొరత లేకుండా యూరియా దొరికిందని గుర్తుచేశారు. ఆ తెలివి ప్రస్తుత ముఖ్యమంత్రికి లేదన్నారు. రైతులకు సరిపడా యూరియాను విరివిగా అందుబాటులో ఉంచాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి అంతా హైదరాబాద్‌లో భూములు ఎక్కడున్నాయి. వాటిని ఏం చేయాలనే దానిపైనే ఉంది తప్ప, రైతుల బాధలపై లేదని ఎమ్మెల్యే వేముల విమర్శించారు. నిన్న మొన్నటి దాకా వడ్ల కొనుగోలు కోసం రైతులను ఏడు చెరువుల నీళ్లు తాగించారని, ఇప్పుడు యూరియా కోసం ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి నిరసన తెలుపుతామంటే, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో దాదాపు 300 మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను పొద్దున నుంచి అరెస్ట్ చేసి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇంచార్జ్ సురేందర్ , తాడ్వాయి మండల కేంద్రంలో డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్ రెడ్డిలను అరెస్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని, రోడ్ల మీదికి వస్తున్న రైతులను సైతం వదలకుండా అరెస్ట్ చేస్తున్నారని తెలిపారు. కామారెడ్డి పట్టణంలో బాన్సువాడలో కూడా బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారన్నారు. ప్రజా పాలన తెస్తామన్న రేవంత్ రెడ్డి ఇవాళ నియంతృత్వ పాలన సాగిస్తున్నారు. అరెస్టులతో మా గొంతు నొక్కే బదులు యూరియా యాప్ రద్దు చేసి సరిపడా యూరియా రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డిది ప్రజా పాలనా లేక నియంత పాలనా అనేది తెలంగాణ సమాజం, ప్రజా సంఘాలు ఆలోచించాలి. ఎక్కడో కామారెడ్డి జిల్లాలో నిరసన ఉంటే హైదరాబాద్‌లో మమ్మల్ని అరెస్ట్ చేయడం ఈ ప్రభుత్వం ఎంత నియంతృత్వంగా పనిచేస్తుందో చెప్తోంది. మమ్మల్ని అరెస్ట్ చేసినా రైతుల్లో వచ్చే తిరుగుబాటును మాత్రం ఆపలేరు. రైతులు తప్పకుండా బుద్ధి చెప్తారు'అని ఎమ్మెల్యే వేములహెచ్చరించారు. ఢిల్లీకి 72 సార్లు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మెట్రో రైలు పైన సమావేశాలు పెట్టడానికి సమయం ఉంటుంది కానీ, కేంద్ర ప్రభుత్వాన్ని యూరియా గురించి అడిగే శ్రద్ధ లేదన్నారు. రేవంత్ రెడ్డికి రైతులంటే చాలా చులకన భావం ఉందని విమర్శించారు. అటు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా రాష్ట్రానికి రావాల్సిన యూరియాను ఒకేసారి ఇవ్వకుండా కోతలు విధిస్తోందని, ఇటు రేవంత్ రెడ్డికి కేంద్రం నుండి తెచ్చుకునే తెలివి లేదని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలుగా తాము రైతుల బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుంటే వినే ఓపిక లేకపోగా, రివర్స్‌లో అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. అటు నరేంద్ర మోదీ, ఇటు రేవంత్ రెడ్డి.. ఈ రెండు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా విషయంలో, వడ్ల కొనుగోలు విషయంలో తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచుతున్నాయని ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# వరుస తనిఖీలు చేసినా కానరాని మార్పులు

రెస్టారెంట్లలో అదే అపరిశుభ్రత..-ఫ్రీజర్లలో కాలం చెల్లిన పదార్థాలు

కంచి కేఫ్, కోడికూర చిట్టిగారెకు నోటీసులు

**హైదరాబాద్,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

హైదరాబాద్ పరిధిలోని రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న రెండు ప్రముఖ రెస్టారెంట్లలో నిబంధనల ఉల్లంఘనలను, తీవ్రమైన లోపాలను గుర్తించి నోటీసులు జారీ చేశారు. పుప్పాలగూడలోని కంచి కేఫ్‌లో నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. కిచెన్, స్టోర్ రూమ్ మధ్య ఓపెన్ డస్ట్‌బిన్లు ఉండటంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్వాసన వస్తూ, ఈగలు ముసురుతున్నాయి. స్టోర్ రూమ్ సీలింగ్‌పై దుమ్ము పేరుకుపోగా.. గ్రైండింగ్, కూరగాయలు కట్ చేసే ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండి అపరిశుభ్రంగా మారింది. అంతేకాకుండా, వంటకు ఉపయోగించే కాలీఫ్లవర్‌పై ఫంగస్ పెరిగినట్లు అధికారులు గుర్తించారు. డ్రెయిన్ల వద్ద దుర్వాసన రావడం, ఫ్రిజ్‌లలో నిల్వ చేసిన పిండిపై ఎలాంటి లేబులింగ్ లేకపోవడం గమనించారు. వంటగది, స్టోర్ రూమ్‌లలో ఈగలు, బొద్దింకలు తిరుగుతుండటంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటికి తోడు మెడికల్ ఫిట్‌నెస్, పెస్ట్ కంట్రోల్, వాటర్ టెస్టింగ్, ప్యాకేజింగ్ మెటీరియల్ టెస్టింగ్‌కు సంబంధించిన ఎలాంటి రికార్డులు రెస్టారెంట్ యాజమాన్యం వద్ద అందుబాటులో లేవు. దీంతో ఫుడ్ లేబులింగ్, హౌస్‌కీపింగ్ వెంటనే మెరుగుపరచాలని ఆదేశిస్తూ అధికారులు నోటీసులు ఇచ్చారు. నల్లగండ్లలోని కోడికూర చిట్టిగారే రెస్టారెంట్‌లోనూ తనిఖీలు కొనసాగాయి. ఇక్కడ నిల్వ ఉంచిన చికెన్, డెజర్ట్స్‌పై ఎలాంటి లేబుల్స్ లేవని అధికారులు గుర్తించారు. ఆ లేబుల్స్ లేని ఆహార పదార్థాలను అక్కడికక్కడే పారవేయించారు. గ్రైండింగ్ ఏరియా సీలింగ్‌పై దుమ్ము పేరుకుపోవడంతో పాటు కిచెన్ సీలింగ్ అంతా పూర్తిగా జిడ్డుగా మారినట్లు కనుగొన్నారు. ఆ జిడ్డును వెంటనే శుభ్రం చేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ రెస్టారెంట్‌లోనూ ఉద్యోగుల మెడికల్ ఫిట్‌నెస్, ప్యాకేజింగ్ మెటీరియల్ టెస్టింగ్ రికార్డులు లేకపోవడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు తీవ్రంగా పరిగణించి నోటీసులు జారీ చేశారు.

### ఎక్సైజ్ సూపరింటెండెంట్

# మల్లారెడ్డి నివాసంలో ఏసీబీ సోదాలు

తెల్వారు జాము నుంచే

పలుచోట్ల ఏక కాలంలో తనిఖీలు

**నిజామాబాద్,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

హైదరాబాద్ నగరంలో మరోసారి ఏసీబీ అధికారుల సోదాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి నివాసంలోనూ ఏసీబీ సోదాలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే సోదాలు కొనసాగాయి. ఆదాయానికి మించి అక్రమాస్తులు కలిగి ఉన్నారనే పక్కా సమాచారంతో మల్లారెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువులు, సన్నిహితుల నివాసాల్లోనూ దాడులు చేపట్టారు. హైదరాబాద్, నిజామాబాద్‌లో మొత్తం పదిచోట్ల ఏకకాలంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. మూడు సంవత్సరాల క్రితం ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా మల్లారెడ్డి విధుల్లో చేరారు. ఇటీవల ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు అయ్యింది. దీంతో తెల్లవారుజామునే ప్రత్యేక బృందాలు నిజామాబాద్ చేరుకుని.. అక్కడి ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. ఆఫీసులో విధుల్లో ఉన్న ఉద్యోగులు, సిబ్బందిని కూడా విచారించారు. ప్రగతినగర్‌లో మల్లారెడ్డి అద్దెకు ఉంటున్న ఇంట్లో సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన పత్రాలు లభించినట్లు సమాచారం.

# హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

కేంద్రమంత్రులతో సిఎం రేవంత్ చర్చలు ఫలప్రదం

ఖట్టర్ నివాసంలో కిషన్ రెడ్డితో కలసి భేటీ- మెట్రో రైలుపై చర్చల్లో కీలక పురోగతి

**న్యూఢిల్లీ,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన అడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రులతో జరిపిన వరుస సమావేశాలు విజయవంతమయ్యాయి. మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, అలాగే ఫేజ్-2 విస్తరణ పనుల్లో ఉన్న అన్ని ప్రధాన ఆటంకాలు ఈ చర్చలతో తొలగిపోయాయి. మంగళవారం ఉదయం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు ఉన్నతస్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్, జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మెట్రో విస్తరణ, నిధుల సమీకరణ, కేంద్ర-రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంపై ఈ సమావేశంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు. మెట్రో ప్రాజెక్టును ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిష్ఠాత్మక ఆర్థిక సలహా సంస్థను కన్సల్టెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ ప్రధాన అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో.. దానికి సంబంధించిన అప్పులు, ఈక్విటీ విలువ రుణ సేకరణపై రోడ్ మ్యాప్ తయారు చేస్తుంది. ఫేజ్-2 కింద ప్రతిపాదించిన కారిడార్ల నిర్మాణ వ్యయం ఎంత అవుతుంది? నిధుల కోసం ఏయే అంతర్జాతీయ రుణ సంస్థలను ఎంచుకోవాలి? అనే అంశాలపై నివేదిక అందిస్తుంది. ఈ కన్సల్టెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తదుపరి అడుగులు వేస్తాయి. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కేందప్రభుత్వ ప్రతినిధితో పాటు తెలంగాణ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి సమన్వయ సభ్యులుగా వ్యవహరిస్తారు. కేంద్ర నిబంధనల ప్రకారం డీపీఆర్ లలో మార్పులు చేస్తూ, పనుల అనుమతుల ప్రక్రియను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పరిణామంతో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు కేంద్ర ఆమోదం లభించడం సులభతరం కానుంది. ఇది హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలవనుంది. కేంద్రమంత్రి ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో.. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. మెట్రో ప్రాజెక్టుకు అప్పులు, రెండో ఫేజ్‌కు అనుమతులు, నిధులు కావాలని సీఎం రేవంత్ కోరినట్లు సమాచారం. సమావేశంలో సీఎస్ రామకృష్ణ రావు, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే ఉన్నారు. కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలతో బిజీబిజీగా గడుపు తున్నారు. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు.. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు. అలాగే, తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు. మధ్యాహ్నం 1 గంటకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద జోషిని ఇరువురు మంత్రులు కలవనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని కోరనున్నారు. అనంతరం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో సమావేశమై.. యూరియా సరఫరా పెంచాలని మంత్రులు ఉత్తమ్ కుమార్, తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేయనున్నారు.

# బాసర సరస్వతీ ఆలయంలో చోరీ

కాళీమాత ఆలయంలో వెండి కిరీటం చోరీ

సిసి కెమెరాలపై బట్టలు కప్పి చీరికి పాల్పడ్డట్లు గుర్తింపు

సమాచారం అందుకుని పరిశీలించిన ఎస్పీ

**నిర్మల్,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

బాసరలో కొలువుదీరిన జ్ఞాన సరస్వతి దేవి ఆలయంలో భారీ చోరీ జరిగింది. మొదటి అంతస్తులోని మహంకాళి అమ్మవారి ఆలయంలో తలుపు తాళాలు దొంగలు పగలకొట్టి అమ్మవారి వెండి కిరీటంతోపాటు హుండీని దొంగిలించారు. మంగళవారం తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం చేసేందుకు దేవాలయంలోకి పురోహితులు వెళ్లారు. అమ్మవారి ఆలయంలో చోరీ జరిగిన విషయాన్ని వారు గుర్తించారు అనంతరం దేవస్థానం అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సరస్వతి అమ్మవారి ఆలయంలోని పై అంతస్తులో ఉన్న మహంకాళి అమ్మవారి వెండి కిరీటంతో పాటు హుండీని దుండగులు ఎత్తుకెళ్లారు. గర్భగుడి తాళాలు పగులగొట్టి మరీ ఈ దోపిడీకి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. మంగళవారం తెల్లవారుజామున సుప్రభాత సేవ, పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ గుడికి వచ్చిన సందర్భంగా తాళాలు పగులగొట్టి ఉండటం గుర్తించాడు. వెంటనే ఈ విషయాన్ని ఆలయ భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. ఆలయ భద్రతా సిబ్బంది ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆలయ పూజారి చేత తలుపులు తెరిపించారు. ఆ సమయంలో అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటంతో పాటు హుండీని అపహరించినట్లు పోలీసులు గుర్తించారు.కాగా, సీసీ కెమెరాలపై వస్త్రాలు కప్పి దొంగలు ఆలయంలోకి ప్రవేశించినట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. చోరీకి పాల్పడిన హుండీలో నుంచి డబ్బులు తీసుకుని, తర్వాత హుండీని వ్యాసగుడి సమీపంలో పడేసినట్లుగా పోలీసులు గుర్తించారు.

# నిజామాబాద్ ఎక్సైజ్ అధికారి మల్లారెడ్డి అరెస్ట్

నాంపల్లి కోర్టులో హాజరు పర్చిన అధికారులు

సోదాల్లో భారీగా ఆస్తులు, నగదు గుర్తింపు


**హైదరాబాద్,జూన్23(హైదరాబాద్ మిర్రర్):**

నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును ఏసీబీ నమోదు చేసింది. అనంతరం ఆయన్ను అరెస్ట్ చేసి నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరిచింది. అక్రమాలకు పాల్పడి ఆస్తులు సంపాదించినట్లు మల్లారెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని మచ్చబొల్లారం, నిజామాబాద్‌లోని ప్రగతినగర్‌లోని మల్లారెడ్డి నివాసాలతో పాటు ఆయన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ తనిఖీల్లో మల్లారెడ్డికి చెందిన పలు ఆస్తులను గుర్తించారు. 4 ఇళ్లు, ఒక వాణిజ్య భవనం, 8 ఖాళీ ప్లాట్లు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు తేల్చారు. ఆయన వద్ద సుమారు రూ.3.31లక్షల నగదు, రూ.50లక్షల బ్యాంకు నిల్వలు, మల్లారెడ్డి భార్య, కుటుంబ సభ్యుల పేర్లపై 3 బ్యాంకు లాకర్లు ఉన్నట్లు గుర్తించారు. విచారణలో భాగంగా వీటిని త్వరలో తెరవనున్నారు. సోదాల్లో గుర్తించిన మొత్తం ఆస్తుల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు రూ.3కోట్లుగా అంచనా వేశారు. మార్కెట్ విలువ ప్రకారం అనేక రెట్లు అధికంగా ఉండే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. మల్లారెడ్డిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు పరిచిన అనంతరం రిమాండ్‌కు పంపారు.

# మా ఇంటి బంగారాన్ని అభినందించిన మెగాస్టార్

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదలైన తర్వాత మంచి స్పందనను అందుకుంటోంది. దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహం అనంతరం సమంత నటించిన తొలి సినిమా కావడంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. జూన్ 19న థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా మంచి వసూళ్లను నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సమంత, రాజ్ నిడిమోరు దంపతులతో పాటు దర్శకురాలు నందిని రెడ్డి, చిత్ర యూనిట్ సభ్యులను తన నివాసానికి ఆహ్వానించిన ఆయన, సినిమా విజయంపై శుభాకాంక్షలు తెలిపారు. సినిమా చూసిన అనంతరం చిరంజీవి తన అభిప్రాయాన్ని పంచుకుంటూ, మా ఇంటి బంగారం చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఉమ్మడి కుటుంబం నేపథ్యంలో యాక్షన్, భావోద్వేగాలను అందంగా మేళవిస్తూ దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో వినోదాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు అని పేర్కొన్నారు. అలాగే సమంత నటనను ప్రత్యేకంగా ప్రశంసించిన ఆయన, సమంత నటన అద్భుతంగా ఉంది. ముఖ్యంగా చీరకట్టులో ఆమె చేసిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇటువంటి మహిళా ప్రాధాన్య చిత్రాలు తెలుగు సినీ పరిశ్రమకు అవసరం. ఈ విజయానికి సమంత, నందిని రెడ్డి, రాజ్ మరియు మొత్తం చిత్ర బృందానికి హృదయపూర్వక అభినందనలు అని తెలిపారు. మరోవైపు జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆహ్వానిస్తున్న సమంత, రాజ్ దంపతులకు ప్రత్యేక అభినందనలు అని ఆయన పేర్కొన్నారు. చిరంజీవి సతీమణి సురేఖ సమంత దంపతులకు కొత్త బట్టలు పెట్టి ఆశీర్వదించారు. ఈ కామెంట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసింది. ముఖ్యంగా 'కొత్త అధ్యాయం' అనే పదం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. దీనిపై సోషల్ మీడియాలో పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. సమంత ప్రగ్నెన్సీ విషయంలో చిరు ఈ కామెంట్ చేశారా అని పలువురు ముచ్చటించుకుంటున్నారు. ఇక జూన్ 19న విడుదలైన 'మా ఇంటి బంగారం' మొదటి రోజునుంచే ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంది. ముఖ్యంగా సమంత నటన, భావోద్వేగ సన్నివేశాలు, కుటుంబ నేపథ్యం, యాక్షన్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.





# పెద్ది తరవాత బుచ్చిబాబులో మార్పు

## కొత్త సినిమా కోసం వేగం పెంచాలని నిర్ణయం

టాలీవుడ్‌లో దర్శకుడు బుచ్చిబాబు సాన గురించి మాట్లాడినప్పుడు ముందుగా గుర్తుకొచ్చేది ఆయన కథలపై చూపించే నిబద్ధత. ఒక సినిమా పూర్తయిన వెంటనే మరో ప్రాజెక్ట్‌ను ప్రారంభించే దర్శకుల కంటే, కథను పూర్తిగా సిద్ధం చేసి, ప్రతి అంశాన్ని పక్కాగా మలిచిన తర్వాతే సెట్స్‌పైకి తీసుకెళ్లే దర్శకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే ఇప్పుడు బుచ్చిబాబు తన పని విధానంలో కీలకమైన మార్పుకు సిద్ధమవుతున్నారనే చర్చ ఇండస్ట్రీలో జోరుగా సాగుతోంది. 'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా అద్భుతమైన అరంగేట్రం చేసిన బుచ్చిబాబు తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్నారు. అయితే ఆ సినిమా తర్వాత వెంటనే కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించకుండా, తన రెండో చిత్రానికి అవసరమైన కథ, పాత్రలు, ప్రీ-ప్రొడక్షన్ పనులపై చాలా సమయం కేటాయించారు. దీంతో 'ఉప్పెన' తర్వాత ఆయన తదుపరి చిత్రం కోసం అభిమానులు, సినీ పరిశ్రమ దాదాపు కొన్ని సంవత్సరాలు ఎదురుచూడాల్సి వచ్చింది. చివరకు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని అందుకుంది. 'పెద్ది' విజయం బుచ్చిబాబు కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలిచింది. గ్రామీణ నేపథ్యం, భావోద్వేగాలతో కూడిన కథనం, పాత్రల రూపకల్పన, విజువల్ ట్రీట్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆయన కథ చెప్పే తీరు, భావోద్వేగాలను తెరపై ఆవిష్కరించే విధానానికి విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభించాయి. గతంతో పోలిస్తే చాలా తక్కువ సమయంలోనే తన తదుపరి సినిమాను ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం టాలీవుడ్‌లో పోటీ తీవ్రంగా పెరిగింది. ఒక దర్శకుడు వరుస విజయాలను కొనసాగించాలంటే తక్కువ వ్యవధిలోనే కొత్త ప్రాజెక్ట్‌లను ప్రకటించడం కూడా కీలకంగా మారింది. ఈ విషయాన్ని బుచ్చిబాబు కూడా గుర్తించినట్లు కనిపిస్తోంది. అందుకే ఈసారి కథా రచన, ప్రీ-ప్రొడక్షన్ ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి తదుపరి సినిమాను త్వరగా పట్టాలెక్కించాలని ఆయన భావిస్తున్నారని సమాచారం.

# బాహుబలి: ది ఎటర్నల్ వార్

## కీలక అప్‌డేట్‌ను అందించిన ప్రభాస్


పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు మరో సర్‌ప్రైజ్ అందించారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న కొత్త యానిమేషన్ ప్రాజెక్ట్ 'బాహుబలి: ది ఎటర్నల్ వార్'కు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను ప్రభాస్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ అభిమానుల్లో భారీ ఆసక్తిని పెంచారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యానిమేషన్ రూపంలో ప్రభాస్ యోధుడి అవతారంలో కనిపించడం అభిమానులకు గూస్‌బంప్స్ కలిగిస్తోంది. 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక యానిమేషన్ ఉత్సవాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఫ్రాన్స్‌లోని 'అన్నెసీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026'లో 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' ఎంపిక కావడం భారతీయ సినీ పరిశ్రమకు గర్వకారణంగా మారింది. ఈ ఫెస్టివల్‌లో నిర్వహించే 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' సెషన్‌లో ఈ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా యానిమేషన్ రంగానికి చెందిన ప్రముఖులు, స్టూడియోలు, నిర్మాతలు, దర్శకుల సమక్షంలో ఈ ప్రాజెక్ట్ ప్రదర్శించబడనుండటం విశేషం. ప్రభాస్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. ఆయన చేసిన పోస్ట్ కొద్ది నిమిషాల్లోనే లక్షలాది లైక్స్, వేలాది కామెంట్లను సొంతం చేసుకుంది. ఈ యానిమేషన్ చిత్రాన్ని ఆర్కా మీడియా వర్క్స్ నిర్మిస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ఈ ప్రాజెక్ట్‌కు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ యానిమేషన్ దర్శకుడు ఇషాన్ శుక్లా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రభాస్ తన పోస్ట్‌లో .. బాహుబలి: ది ఎటర్నల్ వార్ ప్రాజెక్ట్ అన్నెసీ యానిమేషన్ ఫెస్టివల్‌కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. మా టీమ్ నిజంగా అద్భుతమైన పనిని చేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రపంచం ఎప్పుడెప్పుడు చూస్తుందా అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని పేర్కొన్నారు.



# వరుస సినిమాలతో ప్రభాస్ బిజీ




ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందిన ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాడు. 'బాహుబలి' తర్వాత ఆయన క్రేజ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించగా, ప్రతి సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. అయితే ఈ ఏడాది విడుదలైన 'రాజా సాబ్' సినిమా మాత్రం అభిమానులు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఇదిలా ఉంటే, దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 చివర్లో విడుదల చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుతం ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం 'ఫౌజీ' 2027లో విడుదలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే ఇదే ఇప్పుడు ప్రభాస్ అభిమానులకు మరింత ఆనందాన్ని కలిగిస్తోంది. ఎందుకంటే 2027లో ప్రభాస్ నుంచి ఏకంగా మూడు భారీ ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో మొదటిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' ఉంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. మరోవైపు 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చే యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' కూడా 2027లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ ప్రాజెక్ట్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో 'ఫౌజీ' కూడా అదే ఏడాదిలో విడుదలైతే, ప్రభాస్ అభిమానులకు ఒకే ఏడాదిలో మూడు భారీ ట్రీట్స్ లభించినట్లవుతుంది. దీంతో 2027ను ఇప్పటికే అభిమానులు 'ప్రభాస్ నామ సంవత్సరం'గా అభివర్ణిస్తున్నారు. భిన్నమైన కథలు, భారీ స్థాయి నిర్మాణ విలువలు, పాన్ ఇండియా మార్కెట్‌లో ప్రభాస్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా 'స్పిరిట్', 'ఫౌజీ', 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' చిత్రాలు ఒకే ఏడాదిలో విడుదలైతే భారతీయ సినీ పరిశ్రమలోనే అరుదైన రికార్డులు నమోదయ్యే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు అభిమానుల దృష్టి మొత్తం ఈ ప్రాజెక్ట్‌ల అధికారిక విడుదల తేదీలపైనే ఉంది.



# ఆదర్శకుటుంబం ఆలస్యం అవుతోందా ?




విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న క్రేజీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47. సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు ఇటీవల వార్తలు వినిపించాయి. కానీ పరిస్థితులు చూస్తుంటే అందుకు అనుగుణంగా లేవు అనే టాక్ వినిపిస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఈ సినిమా విడుదలపై ఒక షాకింగ్ గాసిప్ గట్టిగా వినిపిస్తోంది. ఈ మోస్ట్ అవెటెడ్ మూవీ అనుకున్న సమయానికి రావడం లేదని వాయిదా పడే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని టాక్ నడుస్తోంది. ఈ సినిమా షూటింగ్ లో కొన్ని అవాంతరాలు ఎదురయ్యాయని, కొన్ని సీన్స్ రీ షూట్ చేస్తున్నారని అక్టోబర్ 2లు షూటింగ్ ఫినిష్ అయ్యే అవకాశం లేదని టాక్. ఒకవేళ ఈ అక్టోబర్ వీకెండ్ డేట్‌ను గనుక మేకర్స్ మిస్ చేసుకుంటే.. ఆ తర్వాత ఈ ఏడాదిలో సరైన విండో దొరకడం కష్టమేనని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే జరిగితే, 'ఎకె 47' చిత్రాన్ని ఏకంగా 2027 సమ్మర్ సీజన్‌కు మాత్రమే పోస్ట్‌పోన్ చేసే అవకాశాలు ఉన్నట్లు గట్టిగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ గాసిప్స్ పై ప్రొడక్షన్ హౌస్ నుండి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు అలాగే ఖండించలేదు. దీంతో వెంకీ ఫ్యాన్స్ కాస్త కంగారు పడుతున్నారు. మరి ఈ క్రేజీ ప్రాజెక్ట్ అనుకున్న సమయానికే వస్తుందా లేదా లాంగ్ డిలే అవుతుందా అనేది తెలియాలంటే మేకర్స్ క్లారిటీ ఇచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# వారసత్వం ఉన్నా...కష్టపడితేనే ఫలితం

## ప్రేక్షకులు ఊరికే ఆదరిస్తానుకోరాదు-నటుడు రామ్ చరణ్

సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. ప్రేక్షకులు ఎప్పుడూ నటుడి నటను చూసే ఆదరిస్తారని రామ్ చరణ్ అన్నారు. తాజాగా ఆయన 'రిపబ్లిక్ సమ్మిట్'లో పాల్గొని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిజినెస్ భాషలో చెప్పాలంటే.. 'పెద్ది' సినిమా తన కెరీర్‌కు బెస్ట్ 'స్టార్టప్' లాంటిదని వెల్లడించారు. నా చిన్నప్పుడు దర్శకులు, నిర్మాతలు 'మీ నాన్న కంటే బాగా చేయాలి' అని చెప్పినప్పుడు బాధ్యతగా అనిపించేది. నేను ఆ ఒత్తిడిని పెద్దగా పట్టించుకోలేదు. మా నాన్న ఇంట్లో సరదాగా ఉంటారు. మా డైనింగ్ టేబుల్ మీద సినిమా చర్చలు, స్టార్డమ్ ముచ్చట్లు ఎప్పుడూ రానిచ్చేవారు కాదు. సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడం వల్ల త్వరగా ఒక మంచి వేదిక దొరుకుతుందనేది నిజమే.. కానీ, ప్రేక్షకులు మనల్ని ఎవరి వారసుడు అని చూడరు.. మొదటి సినిమా తర్వాత కేవలం మన కష్టం, నిజాయతీ మాత్రమే చూస్తారు. నా 15 ఏళ్ల కెరీర్‌లో ఆయన నాకు ఎప్పుడూ నటన పరంగా ఫీడ్‌బ్యాక్ ఇవ్వలేదు. నన్ను వేలు పట్టి నడిపించలేదు. కానీ క్రమశిక్షణ విషయంలో ఆయనే నాకు స్ఫూర్తి అని చెప్పారు.ఓటీటీల ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. థియేటర్లు, ఓటీటీలు రెండూ ఒకదానికొకటి సాయం చేసుకుంటూ ముందుకు సాగాలి. 'ఆర్ఆర్ఆర్' థియేటర్లలో విడుదలైన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి వచ్చింది.



# సచిన్ రికార్డుకు ఎసరు పెట్టిన జో రూట్



ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ జో రూట్ టెస్ట్ క్రికెట్ లో సరికొత్త హిస్టరీ క్రియేట్ చేశాడు. లండన్ నైట్‌క్లబ్ వివాదం వల్ల బెన్ స్టోక్స్ టీమ్‌కు దూరం అవ్వడంతో జో రూట్ మళ్లీ కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్నాడు. ఓవల్ మైదానంలో న్యూజిలాండ్‌తో జరిగిన సెండ్ టెస్ట్ మ్యాచ్ లో కెప్టెన్సీ ప్రెజర్ ఉన్నప్పటికీ రూట్ బ్యాటింగ్‌లో రెచ్చిపోయాడు. ఈ మ్యాచ్ లో 46, 77 రన్స్ స్కోర్ చేయడం ద్వారా టెస్ట్ క్రికెట్ హిస్టరీలోనే సచిన్ టెండూల్కర్ తర్వాత 14,000 రన్స్ మార్కును దాటిన రెండో బ్యాటర్‌గా రికార్డ్ క్రియేట్ చేశాడు. దీంతో క్రికెట్ ప్రపంచంలో ఇప్పుడు ఒకే ఒక ఇంట్రెస్టింగ్ డిస్కషన్ నడుస్తోంది. సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 15,921 రన్స్ ఆల్ టైమ్ రికార్డును జో రూట్ బ్రేక్ చేయగలడా, అసలు ఆ రేర్ మైలురాయిని ఎప్పుడు అందుకుంటాడు అనే క్వశ్చన్ హాట్ టాపిక్‌గా మారింది. సచిన్ టెండూల్కర్ 2013 లో రిటైర్ అయినప్పుడు అతని 15,921 రన్స్ రికార్డ్ ఎవరూ బ్రేక్ చేయలేరని అందరూ అనుకున్నారు. అలిస్టర్ కుక్, విరాట్ కోహ్లీ, స్టీవ్ స్మిత్ లాంటి స్టార్స్ ట్రై చేసినా సచిన్ రికార్డుకు చాలా దూరంలోనే ఆగిపోయారు. ఒకప్పుడు ఈ రేసులో లేని జో రూట్, 2021 సంవత్సరం నుంచి తన ఆటతీరును కంప్లీట్‌గా మార్చేశాడు. 2021 లో అతను ఏకంగా 61 యావరేజ్‌తో 1,708 రన్స్ చేసి తన కెరీర్ లోనే బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చాడు. ఆ తర్వాత నుంచి రూట్ సెంచరీల కన్వర్షన్ రేట్ డబుల్ అయింది. కెరీర్ ఫస్ట్ ఫేజ్ లో ప్రతీ 6 మ్యాచులకు ఒక సెంచరీ కొట్టిన రూట్, లాస్ట్ ఐదేళ్లలో ప్రతీ 3.5 మ్యాచులకే ఒక సెంచరీ బాదుతున్నాడు. ఈ మైండ్ బ్లోయింగ్ కన్సిస్టెన్సీ వల్లే సచిన్ రికార్డును రూట్ బ్రేక్ చేయడం ఇంపాజిబుల్ కాదు, అది కేవలం టైమ్ ఫ్యాక్టర్ మాత్రమే అని అనలిస్టులు చెప్తున్నారు. ఓవల్ టెస్ట్ ముగిసేసరికి జో రూట్ కెరీర్ టోటల్ 14,075 రన్స్ కు చేరింది. సచిన్ టెండూల్కర్ ఆల్ టైమ్ రికార్డును బ్రేక్ చేయాలంటే రూట్ ఇంకా 1,846 రన్స్ చేయాల్సి ఉంటుంది. రూట్ ఉన్న ప్రెజెంట్ ఫామ్ ప్రకారం చూస్తే మరో 25 టెస్ట్ మ్యాచ్‌లు లేదా 42 ఇన్నింగ్స్ ఆడితే ఈ రన్స్ ఈజీగా వచ్చేస్తాయి. అయితే ఇంగ్లాండ్ రాబోయే క్రికెట్ షెడ్యూల్ మునుపటి కంటే కాస్త తక్కువగా ఉంది. న్యూజిలాండ్ సిరీస్ తర్వాత ఆగస్టులో పాకిస్తాన్‌తో హోమ్ సిరీస్, ఆ తర్వాత సౌతాఫ్రికా టూర్ ఉన్నాయి. ఇక 2027 లో బంగ్లాదేశ్ సిరీస్, ఆస్ట్రేలియాతో 150వ యానివర్సరీ చారిత్రాత్మక టెస్ట్, ఆపై ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ ఉన్నాయి. ఈ లెక్కన చూస్తే ప్రెజెంట్ డబ్ల్యూటీసీ సైకిల్ ముగిసేసరికి రూట్ సచిన్ రికార్డును దాటడం కష్టమే కావచ్చు. ప్రస్తుత ప్రాజెక్ట్ ప్రకారం, జో రూట్ ఈ వరల్డ్ రికార్డును బ్రేక్ చేసే గోల్డెన్ ఛాన్స్ 2028 స్టార్టింగ్‌లో జరిగే ఇండియా టూర్ లో వచ్చే అవకాశం ఉంది. అప్పటికి రూట్ ఏజ్ 38 ఇయర్స్ కి చేరుకుంటుంది. సచిన్ టెండూల్కర్ తన లాస్ట్ టెస్ట్ మ్యాచ్ ఆడిన ముంబైలోని వాంఖెడే స్టేడియంలోనే జో రూట్ ఈ ఆల్ టైమ్ రికార్డును బ్రేక్ చేస్తే క్రికెట్ హిస్టరీలోనే అది ఒక బిగ్గెస్ట్ పోయెటిక్ మూమెంట్ అవుతుంది. వయసు పైబడుతున్నా రూట్ ఫిట్‌నెస్, డ్యూరబిలిటీ అద్భుతంగా ఉన్నాయి. ఒకప్పుడు ఇంపాజిబుల్ అనుకున్న సచిన్ రికార్డు పర్వతాన్ని జో రూట్ తన ప్రతీ ఇన్నింగ్స్ తో కరిగిస్తూ సంచలనం సృష్టిస్తున్నాడు.



## వరుస ఫెయిల్యూర్స్ ఉన్నా
# ఫ్లెమింగ్‌కే ఓటు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో మోస్ట్ సక్సెస్ ఫుల్ ఫ్రాంచైజీ అయిన చెన్నై సూపర్ కింగ్స్ ఒక బిగ్ డెసిషన్ తీసుకుంది. ఐపీఎల్ 2026 సీజన్ లో ఘోరంగా ఫెయిల్ అయ్యాక కోచింగ్ స్టాఫ్ లో మార్పులు వస్తాయనే రూమర్స్ కు సీఎస్కే మేనేజ్‌మెంట్ ఎండ్ కార్డ్ వేసింది. తాజా రిపోర్ట్ ప్రకారం హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను పదవి నుంచి తొలగించే ఆలోచన సీఎస్కేకు లేదు. 2008 నుంచి ఈ ఫ్రాంచైజీతో ప్లేయర్‌గా అసోసియేట్ అయిన ఫ్లెమింగ్, 2009 నుంచి హెడ్ కోచ్‌గా సేవలు అందిస్తున్నాడు. ఐపీఎల్ 2025 లో లాస్ట్ ప్లేస్ లో నిలిచిన చెన్నై, ఐపీఎల్ 2026 లో ఎయిత్ ప్లేస్ కే పరిమితమైంది. దీంతో సోషల్ మీడియాలో "శాక్ ఫ్లెమింగ్" క్యాంపెయిన్స్ నడిచినా మేనేజ్‌మెంట్ మాత్రం అతనిపైనే నమ్మకం ఉంచింది. అతని కాంట్రాక్ట్ ను మరో సీజన్ కోసం ఎక్స్‌టెండ్ చేయనున్నారు. ప్రస్తుతం స్టీఫెన్ ఫ్లెమింగ్ అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ (మీజ) లో చెన్నై సబ్సిడరీ టీమ్ అయిన టెక్సాస్ సూపర్ కింగ్స్ కు హెడ్ కోచ్‌గా వర్క్ చేస్తున్నాడు. ఈ టోర్నీ ముగిసిన వెంటనే సీఎస్కే మేనేజ్‌మెంట్ ఐపీఎల్ 2026 పర్ఫార్మెన్స్ పై ఒక అఫీషియల్ రివ్యూ మీటింగ్ కండక్ట్ చేయనుంది. అక్కడే ఫ్లెమింగ్ కాంట్రాక్ట్ ఎక్స్‌టెన్షన్ పై అఫీషియల్ స్టాంప్ పడనుంది. సీఎస్కే తీసుకున్న ఈ డెసిషన్ వెనుక లెజెండ్ ఎమ్మెస్ ధోనీ ఇన్ఫ్లుయెన్స్ ఇంకా స్ట్రాంగ్ గా ఉందని స్పష్టంగా అర్థమవుతోంది. ధోనీ, ఫ్లెమింగ్ కాంబినేషన్ ఐపీఎల్ హిస్టరీలోనే మోస్ట్ సక్సెస్ ఫుల్ కెప్టెన్-కోచ్ పెయిర్ కావడంతో పాత స్ట్రక్చర్‌నే బ్యాక్ చేయాలని చెన్నై ఫిక్స్ అయింది. కాగా ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి ఖలీల్ అహ్మద్, డేవిడ్ మిల్లర్ ల మార్పిడి (స్వాప్) పై కొన్ని ఎంక్వైరీలు వచ్చినా చెన్నై దాన్ని తిరస్కరించింది. అలాగే హార్దిక్ పాండ్యా కోసం ఎలాంటి అప్రోచ్ జరగలేదని మేనేజ్‌మెంట్ స్పష్టం చేశాడు. మరోవైపు ఐపీఎల్ 2027 సీజన్ కు ముందే ఒక సంచలన ప్లేయర్ ట్రేడింగ్ ప్రాసెస్ స్టార్ట్ అయింది. లక్నో సూపర్ జాయింట్స్ నుంచి వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మళ్లీ తన పాత ఫ్రాంచైజీ అయిన ఢిల్లీ క్యాపిటల్స్ లోకి వెళ్లడం దాదాపు ఖాయమైంది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో లక్నో టీమ్ పంత్‌ను ఏకంగా రూ. 27 కోట్ల రికార్డ్ ప్రైస్ పెట్టి కొనుగోలు చేసింది. ఐపీఎల్ హిస్టరీలోనే ఇది అత్యంత ఖరీదైన బిడ్. కానీ లక్నో మేనేజ్‌మెంట్‌తో లీడర్‌షిప్ రోల్ పై వచ్చిన కొన్ని ఇష్యూస్ వల్ల పంత్ ఇప్పుడు లక్నోను వీడాలని డిసైడ్ అయ్యాడు. ఐపీఎల్ ట్రేడ్ విండో రూల్స్ ప్రకారం సీజన్ ముగిసిన ఒక నెల నుంచి నెక్స్ట్ వేలానికి ఒక వారం ముందు వరకు ఈ ప్లేయర్ల మార్పిడికి ఛాన్స్ ఉంటుంది. ఈ మెగా ట్రేడ్ లో భాగంగా రిషభ్ పంత్ ఢిల్లీ క్యాపిటల్స్ లోకి వస్తుండగా, అతని ప్లేస్ లో చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జాయింట్స్ లోకి వెళ్లనున్నాడు. ఈ స్వాప్ డీల్ కోసం రెండు ఫ్రాంచైజీలు తీవ్రంగా డిస్కస్ చేస్తున్నాయని ఇన్సైడ్ సోర్స్ సమాచారం. అయితే పంత్ తీసుకునే అమౌంట్, కుల్దీప్ కోసం లక్నో చెల్లించే ప్రైస్ మనీకి సంబంధించిన ఫార్మాలిటీస్ ఇంకా పూర్తి కాలేదు. "రిషభ్-కుల్దీప్ స్వాప్ ట్రేడ్ జరుగుతున్న మాట నిజమే. రెండు ఫ్రాంచైజీలు ఇందులో బిజీగా ఉన్నాయి. కానీ ఫైనల్ అమౌంట్, మిగిలిన ఫార్మాలిటీస్ ప్రెజెంట్ బీసీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ అప్రూవల్ కోసం పెండింగ్ లో ఉన్నాయి" అని ఈ డెవలప్‌మెంట్‌తో క్లోజ్ గా ఉన్న ఒక అఫీషియల్ సోర్స్ స్పష్టం చేశాడు. ఈ డీల్ కి గ్రీన్ సిగ్నల్ వస్తే ఐపీఎల్ 2027 లో ఇదే బిగ్గెస్ట్ ట్రేడ్ అవుతుంది.

# తీవ్ర భావోద్వేగానికి గురైన వైభవ్ సూర్యవంశీ



ఇండియా క్రికెట్ హిస్టరీలో సరికొత్త సంచలనం సృష్టిస్తున్న 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ఇంటర్నేషనల్ కెరీర్ లో బిగ్గెస్ట్ మైలురాయిని అందుకున్నాడు. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు వెళ్లే సీనియర్ టీ20 స్క్వాడ్‌కు అజిత్ అగార్కర్ సెలెక్షన్ కమిటీ వైభవ్‌ను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. జూన్ 26 నుంచి ఐర్లాండ్ సిరీస్ స్టార్ట్ అవ్వబోతుండగా, హోటల్ రూమ్‌లో వైభవ్‌కు టీమిండియా అఫీషియల్ జెర్సీని అందజేశారు. దీనికి సంబంధించిన ఎమోషనల్ వీడియోను బీసీసీఐ తన అఫీషియల్ హ్యాండిల్‌లో షేర్ చేసింది. టీమ్ ప్రసిద్ధ త్రోడౌన్ స్పెషలిస్ట్ రఘు స్వయంగా వైభవ్ రూమ్‌కు వెళ్లి కిట్ బాక్స్ ఇచ్చాడు. రఘును చూడగానే వైభవ్ ఎంతో వినయంగా అతని పాదాలకు నమస్కరించి బ్లెస్సింగ్స్ తీసుకోవడం ఫ్యాన్స్ మనసులను గెలుచుకుంది. జెర్సీని చేతిలోకి తీసుకున్న తర్వాత వైభవ్ సూర్యవంశీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. "నిజంగా ఈ అనుభూతిని చెప్పడానికి మాటలు రావడం లేదు. ఏ కల కోసమైతే నేను ఫస్ట్ డే బ్యాట్ పట్టుకుని ప్రాక్టీస్ కోసం క్రికెట్ గ్రౌండ్‌కు వెళ్లానో, ఆ డ్రీమ్ ఈరోజు నెరవేరింది. నా లైఫ్ లో మోస్ట్ ఇంపార్టెంట్ స్టెప్ కంప్లీట్ అయింది. ఇది ఒక కలలా అనిపిస్తోంది. ఆ బ్లూ టీషర్ట్ పై నా పేరు చూడగానే ముఖంలో నవ్వు ఆపుకోలేకపోయా. కొన్నిసార్లు మనం అస్సలు ఊహించని అద్భుతాలు మన లైఫ్ లో జరుగుతాయి, అవి నిజమైనప్పుడు ఎలా రియాక్ట్ అవ్వాలో కూడా అర్థం కాదు. నా సిట్యుయేషన్ కూడా ప్రెజెంట్ అలాగే ఉంది" అని వైభవ్ ఎమోషనల్ గా చెప్పాడు. ఈ సిరీస్ లో వైభవ్ సూర్యవంశీకి నంబర్ 3 జెర్సీని కేటాయించారు. గతంలో ఇండియా లెజెండ్స్ అయిన హర్భజన్ సింగ్, సురేష్ రైనా లాంటి స్టార్స్ ఈ నంబర్ జెర్సీతోనే మైదానంలో అదరగొట్టారు. ప్రొఫెషనల్ కెరీర్ స్టార్టింగ్ లో నంబర్ 12 జెర్సీ వేసుకున్న వైభవ్, తన తల్లి సలహా మేరకే నంబర్ 3 కి చేంజ్ అయ్యాడు. 12 లో ఉన్న అంకెలను ప్లస్ చేస్తే (1o2) మూడు వస్తుందని, అలాంటప్పుడు డైరెక్ట్‌గా నంబర్ 3 ఎందుకు తీసుకోకూడదు అని అతని తల్లి చెప్పిన మ్యాథ్స్ ఈక్వేషన్ వైభవ్‌కు బాగా లక్ కలిసి వచ్చేలా చేసింది. ఐపీఎల్ లో రికార్డ్ రన్స్ తో ఆరెంజ్ క్యాప్ గెలిచిన ఈ యంగ్ ఓపెనర్, అదే నంబర్ 3 జెర్సీతో ఇండియా సీనియర్ టీమ్ లో సత్తా చాటాలని చూస్తున్నాడు. ఇండియా సీనియర్ టీ20 స్క్వాడ్‌లోకి ఎంట్రీ దక్కినప్పటికీ, ప్లేయింగ్ ఎలెవన్ లో ఓపెనర్‌గా గ్రౌండ్ లోకి దిగడం వైభవ్‌కు అంత ఈజీ కాదు. ఎందుకంటే ఓపెనింగ్ స్లాట్స్ కోసం టీమ్ లో ఆల్రెడీ సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ లాంటి సీనియర్ డ్యాషింగ్ బ్యాటర్లతో భారీ కాంపిటీషన్ ఉంది. ఐర్లాండ్‌తో జరిగే ఫస్ట్ మ్యాచ్ లో మేనేజ్‌మెంట్ వైభవ్‌కు డెబ్యూ క్యాప్ ఇస్తే, సచిన్ టెండూల్కర్ రికార్డును బ్రేక్ చేస్తూ ఇండియా తరఫున ఇంటర్నేషనల్ క్రికెట్ ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా వైభవ్ సూర్యవంశీ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేస్తాడు. ఈ వండర్ కిడ్ ఇంటర్నేషనల్ ఎంట్రీ కోసం ఇండియా అంతా చాలా ఈగర్‌గా వెయిట్ చేస్తోందని క్రికెట్ అనలిస్ట్ స్పష్టం చేశాడు.

# ఢిల్లీ క్యాపిటల్స్ లోకి రిషభ్ పంత్




ఇండియన్ ప్రీమియర్ లీగ్ హిస్టరీలోనే మోస్ట్ సెన్సేషనల్ ప్లేయర్ ట్రేడింగ్ అఫీషియల్ గా కన్ఫర్మ్ అయింది. లక్నో సూపర్ జాయింట్స్ మాజీ కెప్టెన్ రిషభ్ పంత్ మళ్లీ తన పాత ఫ్రాంచైజీ అయిన ఢిల్లీ క్యాపిటల్స్ లోకి రీ-ఎంట్రీ ఇస్తున్నాడు. ఈ క్రేజీ ట్రేడ్‌కు ఐపీఎల్ గవర్నింగ్ బాడీ జూన్ 23 మంగళవారం అఫీషియల్ మీడియా స్టేట్‌మెంట్ ద్వారా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. "లక్నో సూపర్ జాయింట్స్ మాజీ కెప్టెన్ రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ లోకి వస్తున్నాడు, అతని ప్లేస్ లో చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జాయింట్స్ లో జాయిన్ కానున్నాడు" అని ఐపీఎల్ మేనేజ్మెంట్ తెలిపింది. ఈ మెగా డీల్ ఐపీఎల్ సర్కిల్స్ లో ఒక బిగ్గెస్ట్ ఎన్‌కౌంటర్‌గా మారింది. ఈ ట్రేడింగ్ లో రిషభ్ పంత్‌కు భారీగా శాలరీ కట్ (పే కట్) అయింది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో లక్నో సూపర్ జాయింట్స్ రికార్డ్ స్థాయిలో రూ. 27 కోట్లు పెట్టి పంత్‌ను కొనుగోలు చేసింది. ఐపీఎల్ హిస్టరీలోనే అత్యంత కాస్ట్లీ ప్లేయర్‌గా నిలిచిన పంత్, ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్ లోకి రావడం కోసం ఏకంగా రూ. 12 కోట్లు వదులుకున్నాడు. కేవలం రూ. 15 కోట్ల రివైజ్డ్ ప్రైస్ తోనే పంత్ ఢిల్లీ జెర్సీ వేసుకోబోతున్నాడు. మరోవైపు కుల్దీప్ యాదవ్ తన ప్రెజెంట్ శాలరీ అయిన రూ. 13.50 కోట్ల సేమ్ ఫీజ్‌తోనే లక్నో సూపర్ జాయింట్స్ లోకి వెళ్తున్నాడు. పంత్ శాలరీ గ్రాఫ్ ఈ రేంజ్ లో పడిపోవడం క్రికెట్ ఫ్యాన్స్ ను బాగా షాక్ కు గురిచేసింది. గత రెండు సీజన్లుగా ఐపీఎల్ లో రిషభ్ పంత్ పర్ఫార్మెన్స్ అస్సలు బాలేదు. లక్నో సూపర్ జాయింట్స్ రూ. 27 కోట్లు పెట్టినా పంత్ ఆ రేంజ్ ఇంపాక్ట్ చూపించలేకపోయాడు. లాస్ట్ రెండు సీజన్లలో కలిపి 28 ఇన్నింగ్స్ ఆడిన పంత్, కేవలం మూడు సార్లు మాత్రమే యాభై కంటే ఎక్కువ రన్స్ స్కోర్ చేయగలిగాడు. ఇందులో ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఐపీఎల్ 2025 లో 24.45 యావరేజ్, 133.16 స్ట్రైక్ రేట్‌తో కేవలం 269 రన్స్ మాత్రమే చేశాడు. 2026 సీజన్ లో కూడా పరిస్థితి పెద్దగా మారలేదు. 28.36 యావరేజ్, 138.05 స్ట్రైక్ రేట్‌తో 312 రన్స్ మాత్రమే స్కోర్ చేశాడు. బ్యాటింగ్ లోనే కాకుండా కెప్టెన్సీ లోనూ ఘోరంగా ఫెయిల్ అయ్యాడు. ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన వెంటనే లక్నో కెప్టెన్సీ నుంచి పంత్ తప్పుకున్నాడు. అయితే మేనేజ్‌మెంట్‌తో వచ్చిన గొడవల వల్లే అతన్ని కెప్టెన్సీ నుంచి సాక్ చేశారనే టాక్ కూడా గట్టిగా నడిచింది. పంత్ బ్యాడ్ ఫామ్ వల్లే లక్నో అతన్ని వదిలించుకోవాలని చూసింది. కరెక్ట్ టైమ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ తమ పాత మ్యాచ్ విన్నర్ ను వెనక్కి తీసుకోవడానికి ఇంట్రెస్ట్ చూపించింది. పంత్ ప్లేస్ లో లక్నో సూపర్ జాయింట్స్ లోకి వెళ్తున్న కుల్దీప్ యాదవ్ ఒంటిచేత్తో మ్యాచ్ లు గెలిపించగల కేపబిలిటీ ఉన్న స్పిన్నర్. లక్నో పిచ్ లపై కుల్దీప్ బౌలింగ్ చాలా ఎఫెక్టివ్ గా ఉంటుందని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఈ బిగ్ ట్రేడింగ్ ఐపీఎల్ 2027 సీజన్ విజువల్స్ ను కంప్లీట్‌గా మార్చేయబోతోందని తెలుస్తోంది.



# గాయంతో టీ20 జట్టు నుంచి నితీశ్ ఔట్..!

ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌కు ముందు టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తర్వాత ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి తొడ కండరాల గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. కాగా, నితీశ్ స్థానంలో యువ ప్లేయర్ సూర్యాంశ్ షెడ్జెను బీసీసీఐ మంగళవారం జట్టులోకి ఎంపిక చేసింది. జూన్ 26, 28 తేదీల్లో ఐర్లాండ్‌తో , జులై 1 నుంచి ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది.అఫ్ఘానిస్థాన్‌తో వన్డే సిరీస్ ముగిసింది. భారత జట్టు త్వరలో ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో తలపడనుంది. ఇందులో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో టీమిండియా బరిలోకి దిగనుంది. జూన్ 26, జూన్ 28 తేదీల్లో ఐర్లాండ్ వేదికగా ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇప్పటికే బీసీసీఐ.. టీమిండియా జట్టును ఎంపిక చేసింది. కానీ మ్యాచ్‌లకు మూడు రోజుల ముందు టీమిండియాకు షాక్ తగిలింది. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి గాయం కారణంగా ఈ సిరీస్‌లకు దూరమయ్యాడు.ఇప్పటికే మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి టీ20 జట్టు నుంచి వైదొలగగా.. తాజాగా తొడ కండరాల గాయం కారణంగా ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లతో టీ20 సిరీస్‌కు అతడు అందుబాటులో ఉండడని బీసీసీఐ తెలిపింది. దీంతో ఈ సిరీస్‌లుకు నితీశ్ ప్లేసులో బీసీసీఐ సూర్యాంశ్ షెడ్జెను ఎంపిక చేసింది. ఈ మేరకు అధికారికంగా ప్రకటన విడుదల చేసింది.

# చరిత్ర సృష్టించిన లియోనెల్ మెస్సీ..



లియోనెల్ మెస్సీ ఫుట్‌బాల్ చరిత్రలో మరో అద్భుత మైలురాయిని అందుకున్నాడు. జూన్ 22, 2026న ఫిఫా వరల్డ్ కప్ 2026 గ్రూప్ జెలో ఆస్ట్రియాతో జరిగిన మ్యాచ్‌లో అర్జెంటీనా కెప్టెన్ రెండు గోల్స్ కొట్టి పురుషుల వరల్డ్ కప్ ఆల్ టైమ్ అత్యధిక గోల్స్ రికార్డును బద్దలు చేశాడు. ఇంతకుముందు జర్మనీ లెజెండ్ మిరోస్లావ్ క్లోజ్ 16 గోల్స్‌తో రికార్డు సృష్టించాడు. మెస్సీ ఈ మ్యాచ్‌లో 17వ గోల్‌తో ఆ రికార్డును సమం చేసి, 18వ గోల్‌తో దాటేశాడు. మ్యాచ్ డల్లాస్‌లోని స్టేడియంలో జరిగింది. మెస్సీ తొలుత పెనాల్టీ కిక్ మిస్ చేశాడు కానీ 38వ నిమిషంలో ఫకుండో మెడినా పాస్‌ను లెఫ్ట్ ఫుట్‌తో అందుకుని అద్భుత గోల్ చేశాడు. ఇది అతని 17వ వరల్డ్ కప్ గోల్. అప్పటికే అల్జీరియాపై హ్యాట్రిక్‌తో 16 గోల్స్ సాధించి క్లోజ్‌ను సమం చేశాడు. ఇన్జ్యూరీ టైమ్‌లో (90o5') మరో గోల్ చేసి రికార్డును తనదిగా చేసుకున్నాడు. అర్జెంటీనా 2-0తో విజయం సాధించి నాకౌట్ స్టేజ్‌కు అర్హత సాధించింది. ఈ విజయంతో మెస్సీ వరల్డ్ కప్‌లో అత్యధిక విజయాలు, అత్యధిక మ్యాచ్‌లు, అత్యధిక నిమిషాలు వంటి ఇతర రికార్డులను కూడా విస్తరించాడు. మెస్సీ ఈ టోర్నమెంట్‌లో ఇప్పటికే 5 గోల్స్ చేశాడు. అతను 6వ వరల్డ్ కప్ ఆడుతున్న మొదటి ఆటగాడు. 38 ఏళ్ల వయసులో కూడా అతని ప్రదర్శన అద్భుతం. ఇంతకుముందు 2022లో వరల్డ్ కప్ గెలిచిన అర్జెంటీనా బ్యాక్ టు బ్యాక్ టైటిల్ కోసం ఆశలు కలిగించింది. మెస్సీ తండ్రి ఆరోగ్య సమస్యలు ఉన్నా, అతను జట్టుకు నాయకత్వం వహించి చరిత్ర సృష్టించాడు. ఇంటర్నేషనల్ గోల్స్‌లో క్రిస్టియానో రోనాల్డో (143) తర్వాత 121 గోల్స్‌తో రెండో స్థానంలో ఉన్నాడు. ఈ సాధనకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు, మాజీ ఆటగాళ్లు అభినందించారు. జ్లాటన్ ఇబ్రాహిమోవిక్, థియెర్రీ హెన్రీ వంటి లెజెండ్స్ మెస్సీ గ్రేట్‌నెస్‌ను ప్రశంసించారు. వికీపీడియా, మెస్సీ ఇప్పుడు 18 గోల్స్‌తో టాప్ స్కోరర్. మహిళల వరల్డ్ కప్ రికార్డు హోల్డర్ మార్టా (17)ను కూడా దాటేశాడు. అర్జెంటీనా గ్రూప్ జెలో 6 పాయింట్లతో టాప్‌లో ఉంది. మెస్సీ చిన్న వయసు నుంచి రికార్డులు బద్దలు చేస్తున్నాడు.

Printed, published and edited by Makam Gangadhar H. No. 11-5-565, Bhagyalaxmi Towers, Venkateswara Colony, saroornagar, Ranga Reddy Dist. 500 035. T. GOwened by Makam Gangadhar and Printed at Ratna Graphics, H. No. 2-3-703/7, Tirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500013 T. G.H. No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Rangareddy Dist. 500 035. T. G. Editor & Managing Director : Makam Gangadhar +919393446188, PRGI No. TGTEL/2026/A1889